NE click
ePaper
www.shanmukhavelugu.com

షణ్ముఖ
SHANMUKHAVELUGU తెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 196
శనివారం 25 జూలై 2026 పేజీలు 8 వెల : రూ.3
Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

పేపర్ లీక్ చేస్తే పదేళ్ల జైలు, రూ.10కోట్ల జరిమానా?: బిల్లుకు క్యాబినెట్ ఆమోదం



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 24)

ఇంటర్నెట్ డెస్క్: పేపర్ లీకులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన చట్టాన్ని సవరించేందుకు ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించినట్లు సంబంధిత వర్గాల సమాచారం. ముఖ్యంగా ప్రశ్నపత్రాల లీక్‌ల ఘటనలో దోషులకు పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా ముసాయిదా బిల్లును రూపొందించినట్లు తెలుస్తోంది. ఈ బిల్లును క్యాబినెట్ ఆమోదించింది. అయితే, దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.2024 నాటి ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టానికి కేంద్రం కీలక సవరణలు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ చట్టం కింద ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడిన వ్యక్తిగత కేసుల్లో దోషులకు 3-5 ఏళ్ల జైలు శిక్ష, రూ.10లక్షల వరకు జరిమానాను విధిస్తున్నారు. అదే వ్యవస్థీకృత నేరాల్లో అయితే 5-10 ఏళ్ల జైలు శిక్ష, రూ.కోటి వరకు జరిమానా ఉంది. ఈ శిక్షలు, జరిమానాలను భారీగా పెంచుతూ చట్టాన్ని సవరిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలపై శుక్రవారం జరిగిన క్యాబినెట్ భేటీలో చర్చలు జరిపారు. అనంతరం ఈ ముసాయిదా బిల్లును క్యాబినెట్ ఆమోదించింది.

ఇక, పేపర్ లీకులపై విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని మోదీ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే దిల్లీ న్యాయస్థానంలో తొలి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటవ్వగా.. మరో నాలుగింటిని త్వరలోనే ఏర్పాటు చేయనున్నారు. ఈ న్యాయస్థానాల పరిధిలో.. లీకులకు సంబంధించిన కేసుల విచారణను మూడు నెలల్లో పూర్తిచేసి దోషులకు శిక్ష విధించేలా బిల్లులో ప్రతిపాదనలు చేసినట్లు సమాచారం. ▶ 2లో

ఎర్రచందనం మాఫియా మూలాలు సమూలంగా నిర్మూలించాలి

అందుకు డ్రోన్, ఆధునిక సాంకేతికతతో నిఘా పెంచాలి
అటవీశాఖ సమీక్షలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 24)

'రాష్ట్రంలో ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా తుడిచిపెట్టేందుకు డ్రోన్ పరిజ్ఞానం, అత్యాధునిక సాంకేతికత నిఘాను పటిష్ఠం చేయాలి. స్మగ్లింగ్ ముఠాల నెట్‌వర్క్‌ను మూలాలతో సహా నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలి. అక్రమ రవాణాకు అవకాశం లేకుండా జీరో టాలరెన్స్ విధానాన్ని కఠినంగా అమలు చేయాలి' అని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అటవీశాఖ అధికారులను ఆదేశించారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధం, రెండేళ్లలో ఏ మేరకు స్మగ్లింగ్ నిరోధించారు, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పవన్‌కల్యాణ్ గురువారం సమీక్ష నిర్వహించారు. ▶ 2లో

మీకు మార్కులు తగ్గితే లోకేశ్‌కు మార్కులు తగ్గినట్టే

రంపచోడవరంలో చంద్రబాబు

రంపచోడవరంలో మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లో పాల్గొన్న ముఖ్యమంత్రి
'డ్రగ్స్ వద్దు బ్రో' హ్యాండ్‌బుక్, 'బడి కోసం' డోనర్ వెబ్ పోర్టల్ ఆవిష్కరణ
ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని వెల్లడి
గత ప్రభుత్వ అప్పులను తీరుస్తూనే సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తున్నామని స్పష్టీకరణ





(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 24)

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మార్కులు తగ్గితే, అది విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు మార్కులు తగ్గినట్లేనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. లోకేశ్ ఏరికోరి విద్యాశాఖ బాధ్యతలు స్వీకరించారని, విద్యారంగంపై ఆయనకున్న నిబద్ధతకు ఇది నిదర్శనమని అన్నారు. విద్యారంగంలో మార్పు తీసుకురావాలన్న తపనతో ఆయన పనిచేస్తున్నారని, ఇప్పటికే ప్రభుత్వ స్కూళ్లలో కనిపిస్తున్న మార్పులు చూస్తుంటే ఆనందంగా ఉందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరంలో నిర్వహించిన 'మెగా పేరెంట్-టీచర్స్ మీటింగ్' సభలో ▶ 2లో



స్థానిక ఎన్నికల్లో గెలవాలి

ఆగస్టు 15 నుంచి 4 నెలలపాటు గ్రామాలకు వెళ్లాలి
కోనసీమ జిల్లా వైకాపా ముఖ్యనేతలతో మాజీ సీఎం జగన్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 24)

స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా ప్రతిచోటా పోటీ చేయాలి, గెలవాలని అని వైకాపా నేతలకు ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన పార్టీ నాయకులతో జగన్ గురువారం క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. 'ఆగస్టు 15 నుంచి 4 నెలలపాటు నియోజకవర్గ సమన్వయకర్తలు అన్ని గ్రామాలు, వార్డుల్లో పర్యటించాలి. పర్యటనల్లో ఎక్కడికక్కడ పార్టీ కమిటీలను ఏర్పాటు చేసి, స్థానిక ఎన్నికలకు పార్టీని సమాయత్తం చేయాలి. ప్రజా సమస్యలపై గళం విప్పాలి' అని సూచించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రాంతీయ సమన్వయకర్త బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రులు సుభాష్ చంద్ర బోస్, కన్నబాబు, విశ్వరూప్, వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్సీ తోట త్రిమూ ర్తులు, కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, జిల్లా నేతలు పాల్గొన్నారు. వైకాపా ▶ 2లో



విద్యార్థులతో చంద్రబాబు, లోకేశ్ మధ్యాహ్న భోజనం.. కీలక సూచన చేసిన సీఎం

రంపచోడవరంలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్...
హాజరైన చంద్రబాబు, లోకేశ్
విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 24)

ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పోలవరం జిల్లా రంపచోడవరంలో జరిగిన మెగా పేరెంట్-టీచర్ ▶ 2లో

యువత భవిష్యత్తే మోదీకి పరమావధి
పీవీఎన్ మాధవ్

విద్యా రంగంలో మోదీ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిందన్న మాధవ్
గతంలో పోలిస్తే పేపర్ లీకేజీలు బాగా తగ్గాయని వెల్లడి
నీట్ సాకుతో సుప్రీంకోర్టుపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపాటు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 24)

ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం యువత భవిష్యత్తును పరమావధిగా చేసుకుని పనిచేస్తోందని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యా రంగంలో మోదీ ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చిందని, దేశవ్యాప్తంగా ఐఐటీలు, ఐఐఎంలు, గిరిజన విశ్వవిద్యాలయాలను నెలకొల్పడంతో పాటు మెడికల్ సీట్లను భారీగా పెంచిందని వివరించారు. గత ప్రభుత్వాల హయాంతో పోలిస్తే తమ పాలనలోనే విద్యా పేపర్ లీకేజీలు గణనీయంగా తగ్గాయని, నీట్ వ్యవహారంలో సమస్య వెలుగుచూడగానే కేంద్రం తక్షణమే కఠిన చర్యలు తీసుకుందని తెలిపారు. నీట్ వివాదాన్ని సాకుగా చూపి కొందరు విపక్ష నేతలు ఢిల్లీ వేదికగా మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు కుట్రలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. నీట్ సాకుతో ప్రధానితో పాటు అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, నటుడు ప్రకాశ్ రాజ్ సహా కొందరు విద్రోహకర, దేశ వ్యతిరేక వ్యాఖ్యలకు ▶ 2లో

వరికి ప్రత్యామ్నాయ పంటలపై రైతులు ఆలోచించాలి

వైకాపా కంటే కూటమి హయాంలోనే ఎక్కువ సంక్షేమ సాయం
మంత్రివర్గ సమావేశంలో చర్చ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 24)

ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే సమస్యలపై రాష్ట్ర మంత్రివర్గం చర్చించింది. వర్షాభావం నేపథ్యంలో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని మంత్రులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. సాగునీటి సమస్యను దృష్టిలో పెట్టుకుని అందుకు అనుగుణంగా ఆరుతడి పంటలు సాగుచేయాల్సిందిగా రైతన్నలను కోరాలని తెలిపారు. సచివాలయంలో గురువారం నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, చర్చించిన అంశాలను సమాచార, పౌర సంబంధాల ▶ 2లో

చిన్న పరిశ్రమలకు ఆటోమేటిక్‌గా ప్రోత్సాహకాల చెల్లింపు వ్యవస్థ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 24)

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ)కు ప్రోత్సాహకాలు చెల్లించేందుకు ఆటోమేటిక్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని మంత్రి లోకేశ్ అధికారులకు సూచించారు. ఈ విధానాన్ని నిర్దేశిత వ్యవధిలో గ్రౌండింగ్ చేసిన ఎంఎస్ఎంఈలకు వర్తింపజేయాలని కోరారు. యువతకు ఎక్కువ ఉద్యోగావకాశాలు కల్పించే ఎంఎస్ఎంఈల రంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనపై ఏర్పాటైన మంత్రుల బృందం ఉండవల్లిలో మంత్రి లోకేశ్ అధ్యక్షతన సమావేశమైంది. ఆయన మాట్లాడుతూ.. 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు రూ.29.30 లక్షల కోట్ల పెట్టుబడులతో 1,037 పరిశ్రమల ▶ 2లో



మొదటిపేజీ తరువాయి

మీకు మార్కులు తగ్గితే లోకేశ్‌కు మార్కులు తగ్గినట్టే

ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. “కొత్త జిల్లా ఏర్పాటయ్యాక తొలిసారి ఇక్కడికి వచ్చాను. ఇవాళ నేను కూడా టీచర్‌ను అయ్యాను, నేర్చుకోవడానికి విద్యార్థిని అయ్యాను, తల్లిదండ్రులకు చెప్పడానికి మెంటర్‌గా మారాను” అని అన్నారు. పిల్లల భవిష్యత్తు బాధ్యతను తల్లిదండ్రులిద్దరూ తీసుకోవాలని, అప్పుడే వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని హితవు పలికారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో మార్పులు ప్రారంభమయ్యాయని, దీని ఫలితంగానే ప్రైవేట్ పాఠశాలల నుంచి 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారని, ఇదే ప్రభుత్వ స్కూళ్ల సత్తా అని గర్వంగా ప్రకటించారు. గిరిజన ప్రాంతాల్లోని పిల్లలు మట్టిలో మాణిక్యాలని, వారికి అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

‘బడి కోసం’ పోర్టల్ ఆవిష్కరణ.. వెల్లువెత్తిన విరాళాలు

ఈ కార్యక్రమంలో భాగంగా, పాఠశాల విద్యాశాఖ రూపొందించిన ‘డ్రగ్స్ వద్దు బ్రో’ హ్యాండ్‌బుక్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు ఉద్దేశించిన ‘బడి కోసం’ డోనర్ వెబ్ పోర్టల్‌ను ప్రారంభించారు. పోర్టల్ ప్రారంభించిన వెంటనే రంపచోడవరం హైస్కూల్‌కు మీ-సేవ ఆపరేటర్ చిట్టిబోయిన ఉదయ్ కుమార్ లక్ష రూపాయల విరాళం ప్రకటించగా, నెల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు పారిశ్రామికవేత్త పూర్ణచంద్రరావు రూ.4 కోట్లు విరాళం ప్రకటించడం సభలో హర్షాతిరేకాలు నింపింది.

ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ పాలన

రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, మనసుంది కాబట్టే ‘తల్లికి వందనం’ వంటి పథకాలను అమలు చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పులు చేసిందని, ప్రభుత్వ ఆస్తులను సైతం తాకట్టు పెట్టిందని విమర్శించారు. తాము ఆ ఆస్తులను విడిపిస్తూ, అధిక వడ్డీల భారాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితి నుంచి, ప్రస్తుతం ప్రతినెలా ఒకటో తేదీన ఠంచనుగా జీతాలు, పెన్షన్లు ఇస్తున్నామని గుర్తుచేశారు. ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడుతూనే, సంక్షేమం-అభివృద్ధిని సమన్వయం చేస్తున్నామన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమం, యువతకు భవిష్యత్

ఉపాధ్యాయులకు సముచిత గౌరవం ఇస్తున్నామని, పారదర్శక కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు నిర్వహిస్తున్నామని సీఎం తెలిపారు. గత ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ నిర్వహించని గత ప్రభుత్వానికి భిన్నంగా, తాము అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీని పూర్తిచేశామన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో నియమితులైన కొత్త ఉపాధ్యాయులను అభినందించారు. విశాఖకు గూగుల్ వంటి సంస్థలను తీసుకువస్తున్నామని, ఆగస్టు 1న ప్రధాని మోదీ చేతుల మీదుగా భోగాపురం ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన జరుగుతుందని వెల్లడించారు. విద్యార్థులు ఇష్టపడి చదివితే, రాష్ట్రంలోనే పెద్ద ఉద్యోగాలు కల్పించే బాధ్యత తమదని భరోసా ఇచ్చారు.అనంతరం గంజాయి సాగును నిర్మూలించి ఉద్యాన పంటలను ప్రోత్సహిస్తామని, జీవో నెంబర్-3పై చర్చించి గిరిజనులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చిన్న పరిశ్రమలకు ఆటోమేటిక్‌గా ప్రోత్సాహకాల చెల్లింపు వ్యవస్థ

ఏర్పాటుకు వివిధ సంస్థలు ముందుకు వచ్చాయి. వాటి ద్వారా 24.66 లక్షల మందికి ఉపాధి లభించే అవకాశం ఉంది. ప్రతి ప్రాజెక్టునూ ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తూ త్వరితగతిన గ్రౌండ్ చేసేలా చర్యలు తీసుకోవాలి’ అని అన్నారు. సమావేశంలో మంత్రులు పొంగూరి నారాయణ, కందుల దుర్గేష్, గొట్టిపాటి రవికుమార్, కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేపర్ లీక్ చేస్తే పదేళ్ల జైలు, రూ.10కోట్ల జరిమానా?: బిల్లుకు క్యాబినెట్ ఆమోదం

వచ్చే వారం ఈ బిల్లును లోక్‌సభ ముందుకు తీసుకొచ్చే అవకాశం ఉంది.

నీట్ పేపర్ లీక్‌ను వ్యతిరేకిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళన ఉద్ధృతమైన నేపథ్యంలో కేంద్రం ఈ చర్యలకు ఉపక్రమించింది. లీకేజీ ఘటనలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షిస్తామని స్వయంగా ప్రధాని మోదీ గురువారం అర్ధరాత్రి ప్రత్యేక వీడియో విడుదల చేశారు. ఈ బిల్లును వీలైనంత త్వరగా ఆమోదించేందుకు ప్రయత్నిస్తామని ప్రధాని తెలిపారు.

ఎర్రచందనం మాఫియా మూలాలు సమూలంగా నిర్మూలించాలి

పవన్ మాట్లాడుతూ.. ‘అటవీ సంపద, ఎర్ర చందనాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత. స్మగ్లింగ్‌పై కఠినంగా వ్యవహరిస్తున్నాం. ప్రభుత్వం అవలంబిస్తున్న జీరో టాలరెన్స్ విధానాన్ని క్షేత్రస్థాయిలో మరింత పటిష్ఠంగా అమలు చేయాలి. దేశంలో ఎక్కడ ఎర్రచందనం అక్రమ నిల్వలు ఉన్నా.. ఆ రాష్ట్రాల అధికారులతో సమన్వయం చేసుకుని స్వాధీనం చేసుకోవాలి. స్మగ్లింగ్ ముఠాల వెనుక ఉన్న కింగ్ పిన్‌లు, వారి ఆర్థిక మూలాలపైనా దృష్టి సారించాలి. బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి’ అని సూచించారు.

రెండేళ్లలో 1,239 మంది అరెస్టు

‘గత రెండేళ్లలో ఎర్రచందనం అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకున్నాం. 506 కేసుల్లో 1,239 మందిని అరెస్టు చేసి, 372 వాహనాలను స్వాధీనం చేసుకున్నాం. 12 మంది ప్రధాన స్మగ్లర్లపై పీడీ చట్టం కింద చర్యలు తీసుకున్నాం. గుజరాత్, దిల్లీ, కర్ణాటక, తమిళనాడులలో అక్రమంగా నిల్వ చేసిన ఎర్రచందనాన్ని గుర్తించి.. ఆ ప్రాంత పోలీసు, అటవీశాఖల సమన్వయంతో ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించి 35.6 మెట్రిక్ టన్నులు స్వాధీనం చేసుకున్నాం. ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల్లో గతంలో జైలు శిక్షల రేటు 3% కంటే తక్కువగా ఉండేది. ఇప్పుడు 95 శాతం కేసుల్లో నిందితులకు శిక్షలు పడుతున్నాయి’ అని అటవీశాఖ ఉన్నతాధికారులు పవన్‌కల్యాణ్‌కు వివరించారు.

స్థానిక ఎన్నికల్లో గెలవాలి

ఆధ్వర్యంలో ఆగస్టు 9న విజయవాడలో బీసీ గర్జన సభ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, విడదల రజిని, జోగి రమేష్, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ గురువారం ప్రకటించారు.

విద్యార్థులతో చంద్రబాబు, లోకేశ్ మధ్యాహ్న భోజనం.. కీలక సూచన చేసిన సీఎం

మీటింగ్ (పీటీఎం) కార్యక్రమం అనంతరం వారు స్థానిక పాఠశాల విద్యార్థులతో కలిసి భోజనశాలలో కూర్చుని వారితో ముచ్చటించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న ఆహారం నాణ్యత గురించి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఆరా తీశారు. “భోజనం ఎలా ఉంది? రుచిగా ఉందా?” అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ, విద్యార్థుల్లో విటమిన్ లోపాలను నివారించేందుకు పోషకాల కూడిన ఆహారాన్ని అందించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యమే ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి సూచనలపై మంత్రి లోకేశ్ స్పందిస్తూ, ప్రభుత్వం ఇప్పటికే ఆ దిశగా చర్యలు తీసుకుంటోందని వివరించారు. విద్యార్థులందరికీ కంటి పరీక్షలు చేయిస్తున్నామని తెలిపారు. అల్పాహారంగా ఏమైనా అందిస్తున్నారా అని సీఎం అడగగా, ఉదయం పూట రాగి మాల్ట్, మధ్యాహ్న భోజనంతో పాటు చిక్కీ కూడా అందిస్తున్నామని లోకేశ్ బదులిచ్చారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక సూచన చేశారు. విద్యార్థులు ఇంటికి వెళ్లే సమయంలో స్నాక్‌గా చిక్కీలు అందించే ఏర్పాటు చేస్తే మరింత బాగుంటుందని సూచించారు.భోజనం అనంతరం పలువురు విద్యార్థులు ముఖ్యమంత్రితో ఫొటోలు దిగాలని ఉందని కోరారు. వారి అభ్యర్థనకు వెంటనే స్పందించిన చంద్రబాబు, విద్యార్థులతో ప్రత్యేకంగా ఫొటోలు దిగి వారిని ఆనందపరిచారు. సీఎం, మంత్రి నేరుగా తమతో కలిసి భోజనం చేయడం, ఆప్యాయంగా పలకరించడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

యువత భవిష్యత్తే మోదీకి పరమావధి పీవీఎన్ మాధవ్

పాల్పడటం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని విద్యా సంఘాలు విద్యార్థుల ప్రయోజనాలను పక్కనబెట్టి వారి భవిష్యత్తును నాశనం చేసేలా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి దమ్ముంటే తమ సొంత పాలనలో జరిగిన పేపర్ లీకేజీలపై పార్లమెంట్‌లో మాట్లాడాలని, సభలో చర్చల్లో పాల్గొనే ధైర్యం లేకనే ఆయన దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారని సవాల్ విసిరారు. విశాఖ సమీపంలోని భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ వస్తున్నారని, ఈ చారిత్రాత్మక ఘట్టంలో 13 వేల మంది కళాకారులతో కూడిన సంప్రదాయ థింసా నృత్యం, బొబ్బిలి వీణా నాదంతో ఆయనకు అద్భుత స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా ఈ కార్యక్రమం సందర్భంగా ఏకంగా 3 లక్షల మందితో భారీ బహిరంగ సభను నిర్వహించబోతున్నట్లు ప్రకటించారు. భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి వచ్చాక ఉత్తరాంధ్రలో వెనుకబడిన ప్రాంతమంటూ ఏదీ ఉండకూడదనేది సీఎం చంద్రబాబు ఆలోచన అని, ఆ ప్రాంత సమగ్ర ప్రాజెక్టుగా ఇది నిలుస్తుందని పేర్కొన్నారు. విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పేరును చిరస్థాయిగా నిలిపేందుకే ఈ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టారని మాధవ్ వివరించారు.

వరికి ప్రత్యామ్నాయ పంటలపై రైతులు ఆలోచించాలి

శాఖ మంత్రి పార్థసారథి మీడియాకు వివరించారు. “రాష్ట్రంలో ఇప్పటికే 51%లోటు వర్షపాతం నమోదైంది. భూగర్భజలాలు తగ్గనున్నాయి. పోలవరం వద్ద గోదావరిలో ఈ సమయానికి 90వేల నుంచి లక్ష క్యూసెక్కులు ప్రవాహం ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం 35-38వేల క్యూసెక్కులే ఉంది. కృష్ణాడెల్టాకు వస్తున్న గోదావరి నీరు సైతం తగ్గుతోంది. ఇప్పటికే ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల్లో 50%-70% వరినాట్లు వేశారు. ఇకముందు వరి వేసే రైతులు కొంచెం ఆలోచించాలి. ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటలు, ఆరుతడి పంటల సాగుకు విత్తనాలు పంపిణీ చేయనుంది” అని తెలిపారు.

కూటమి ప్రభుత్వంలోనే అధికంగా ఆర్థికసాయం

“కొందరు బోర్లు వేసి, పంటలు సాగుచేయాలని భావిస్తారు. దయచేసి బోర్లు వేయొద్దని కోరుతున్నాం. భూగర్భ జలాలు తగ్గిపోతే తాగునీటి సమస్య ఏర్పడుతుంది. దీర్ఘకాలంలో కరవును ఎదుర్కొనేందుకు గోదావరి-కావేరి అనుసంధానానికి సీఎం చంద్రబాబు కృషిచేస్తున్నారు” అని మంత్రి పేర్కొన్నారు. “వైకాపా అన్నీ అబద్ధాలే ప్రచారం చేస్తోంది. వైకాపా హయాంలో సంక్షేమం ఎక్కువ చేశామని ప్రచారం చేస్తున్నారు. కానీ, కూటమి ప్రభుత్వంలోనే పేదలకు ఎక్కువ ఆర్థికసాయం అందుతోంది కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సీఎం సూచించారు” అని పార్థసారథి తెలిపారు.

ఒక్క ఊరు పరిశీలిస్తేనే..

“నూజీవీడు నియోజకవర్గంలోని సుంకొల్లులో 2023-24లో వైకాపా ప్రభుత్వం అమ్మఒడి కింద రూ.37.70 లక్షలు ఇవ్వగా.. 2024-25లో కూటమి ప్రభుత్వం తల్లికి వందనం కింద రూ.60 లక్షలు ఇచ్చింది. వైకాపా హయాంలో వాహనమిత్ర కింద రూ.2.20 లక్షలు ఇవ్వగా.. ఆటోడ్రైవర్ సేవలో పథకం కింద ఈ ప్రభుత్వం రూ.3.45 లక్షలు అందించింది. రైతుభరోసా కింద వైకాపా ప్రభుత్వం రూ.48.19లక్షలు ఇవ్వగా.. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద రూ.71.40 లక్షలు ఇచ్చింది” అని వెల్లడించారు.

చీఫ్ ఇంజనీర్ బాలు నాయక్ పై అవినీతి ఆరోపణలు నిరాధారం

బీజేపీ యువ మోర్చా ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెల గోమ్స్

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 24)



కనిగిరి పంచాయతీరాజ్ శాఖ చీఫ్ ఇంజనీర్ బాలు నాయక్‌పై ఇటీవల కొందరు చేస్తున్న అవినీతి ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని బీజేపీ యువ మోర్చా ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెల గోమ్స్ స్పష్టం చేశారు. గత మూడు సంవత్సరాల పది నెలలుగా బాలు నాయక్ పంచాయతీరాజ్ శాఖలో నిజాయితీ, పారదర్శకత, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ఎలాంటి అవినీతి ఆరోపణలకు తావివ్వకుండా విశిష్ట సేవలు అందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఆధారాలు లేని ఆరోపణలు చేయడం బాధాకరమని అన్నారు. గతంలో కొందరు చీఫ్ ఇంజనీర్ల హయాంలో ప్రమోషన్ల విషయంలో విమర్శలు వచ్చినప్పటికీ, ప్రస్తుతం బాలు నాయక్ పూర్తిగా ప్రతిభ, అర్హత, నిబంధనల ఆధారంగా ప్రమోషన్లు కల్పిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా డిప్లొమా ఇంజనీర్లకు సరైన ప్రమోషన్ అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని చెప్పారు. అదేవిధంగా, షెడ్యూల్డ్ కులాలు , షెడ్యూల్డ్ తెగలు , చెందిన ఉద్యోగులకు సమాన అవకాశాలు కల్పిస్తూ వారికి ప్రోత్సాహం అందిస్తున్నారని, స్ఫూర్తిదాయకంగా వ్యవహరిస్తున్న అధికారిగా బాలు నాయక్ గుర్తింపు పొందారని గోమ్స్ పేర్కొన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం లేదా పరిపాలనలో పారదర్శకతను దెబ్బతీయాలనే ఉద్దేశంతో అసత్య ఆరోపణలు చేయడం సరికాదని, ఆరోపణలు చేసే వారు ఆధారాలతో ముందుకు రావాలని, లేకపోతే ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని హెచ్చరించారు.

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం మెగా పేరెంట్స్ మీటింగ్ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ ఇమాంస



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 24)

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని పొదిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమామ్ సాహెబ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రకాష్ నగర్, బిసి కాలనీలలో జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, సోమరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పెద్ద సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థి విద్యా ప్రగతి, హాజరు శాతం, ప్రవర్తన మరియు అభ్యాస నైపుణ్యాలను తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఎంసి చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమామ్ సాహెబ్ మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కేవలం ఉపాధ్యాయులే కాకుండా తల్లిదండ్రుల భాగస్వామ్యం కూడా అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా బడికి పంపాలని కోరారు. అనంతరం చదువు, ఆటల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు, క్రమం తప్పకుండా హాజరవుతున్న పిల్లల తల్లిదండ్రులకు ప్రశంసలు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు భారీగా పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్‌కు రూ.18 వేలు అందించిన హబీబుల్లా ఫౌండేషన్ చైర్మన్ కరీముల్లా బేగ్



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 24)

ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్, టీచర్స్ మీటింగ్ నందు ముఖ్య అతిథిగా పొదిలి పట్టణానికి చెందిన హబీబుల్లా ఫౌండేషన్ చైర్మన్ ఎం కరీముల్లా బేగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల అవసార్థం పాఠశాలకు అవసరమగు ఎలక్ట్రిసిటీ మీటర్ కోసం రూ.18 వేలు అవసరం ఉండగా ఆ నిధులను ఆయన అక్కడ చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను ఎంఈఓ, ఇతర ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్- టీచర్స్ మీట్ కార్యక్రమంలో ఆకుపాటి



(షణ్ముఖ వెలుగు, పామూరు,జులై 24)

పామూరు పట్టణ పరిధిలోని కెజిబివి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, విరాట్ నగర్, అంకాలమ్మ వీధి వివిధ పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్-టీచర్స్ మీట్ ఆత్మీయ సమావేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్ పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు కొండిశెట్టి రమణయ్య, ఎంఈఓ కోటిరెడ్డి, పంచాయితీ ఈఓ అరవింద, కెజిబివి ప్రిన్సిపాల్ కటకం సంజన, విద్యా కమిటీ చైర్మన్లు సజన, గుత్తి కొండయ్య, కమిటీ సభ్యులు, పలు పాఠశాలల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ రెండో ఏడాది కూడా ‘తల్లికి వందనం’ అమలు

ప్రతి విద్యార్థి చదువుకు ఆర్థిక భరోసా

ఒంగోలు పార్లమెంట్ ముస్లింమైనార్టీ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్

(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 24)



మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ కార్యక్రమంలో భాగంగా పొదిలి జెడ్ పీ హైస్కూల్ నందు ఒంగోలు పార్లమెంట్ టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నడం జరిగింది. అనంతరం నిర్వహించిన మెగామూవీలో విద్యార్థుల ప్రగతి నివేదికలను పరిశీలించి, తల్లిదండ్రులతో ముఖాముఖిగా మాట్లాడారు. ఈ సందర్భంగా రసూల్ మహమ్మద్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ కూటమి ప్రభుత్వం వరుసగా రెండో ఏడాది కూడా ‘తల్లికి వందనం’ పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. ఇంట్లో చదువుతున్న పిల్లలు ఎంతమంది ఉన్నా ప్రతి విద్యార్థికి సంవత్సరానికి రూ.13,000 చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తూ విద్యాభారాన్ని తగ్గిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 67,47,190 మంది విద్యార్థులకు రూ.10,120.78 కోట్ల రూపాయలు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేయడం ద్వారా విద్యకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను మరోసారి చాటిందన్నారు. అంతేగాక మార్కాపురం జిల్లాను సాధించి ఆదర్శంగా నిలిచేలా మన మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కృషి ఉందన్నారు. అలాగే జిల్లా అభివృద్ధి పనుల్లో వేగం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయాలని, వెలుగొండ ప్రాజెక్టును త్వరలో జాతికి అంకితం చేసి తద్వారా వెలుగొండ జలాలు పొదిలి ప్రాంతానికి అనుసంధానం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్న కందుల నారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మెన్ షేక్ ఖాదర్ బాషా, టీడీపీ బూత్ కన్వీనర్ అంకిత మోహన్ రావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ప్రకాశం


మార్కాపురం


బాపట్ల

షణ్ముఖ
తెలుగు
ప్రతి వార్త తెలుగు వైపు
తెలుగు దినపత్రిక
25.07.26 శనివారం

పీడీసీసీపై విషప్రచారం చేస్తే సహించేది లేదు

బ్యాంకును దెబ్బతీయాలని కొందరి కుట్రలు

చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య


(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 24)



పీడీసీసీ బ్యాంకును అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఉద్యోగులు, రైతులు, ఖాతాదారుల సంక్షేమమే లక్ష్యంగా పారదర్శక పాలన అందిస్తున్నామని పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య స్పష్టం చేశారు. తాను చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి బ్యాంకు అభివృద్ధికి అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు.అయితే కొంతమంది కావాలనే బ్యాంకుపై దుష్ప్రచారం చేస్తూ ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని ఘాటుగా విమర్శించారు. పీడీసీసీ బ్యాంక్ ఉద్యోగులకు వేతన సవరణ, సహకార సంఘ ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీని అమలు చేశామని చైర్మన్ తెలిపారు. జిల్లాలో కొత్తగా మరో ఐదు బ్యాంకు శాఖలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. బ్యాంకు పరిపాలనలో ఎలాంటి దాపరికాలకు తావులేకుండా పూర్తి పారదర్శకతతో పాలన సాగిస్తున్నామని స్పష్టం చేశారు. మొండి బకాయిల రికవరీపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. బకాయిల వసూళ్ల ప్రక్రియ నిరంతరం కొనసాగుతోందని డాక్టర్ కామేపల్లి సీతారామయ్య తెలిపారు. దొంగ బంగారం కేసులో ఉన్న పాత బంగారాన్ని వేలం వేయడం ద్వారా బ్యాంకుకు నాలుగున్నర కోట్ల రూపాయల ఆదాయం సమకూరిందని వెల్లడించారు.

బ్యాంకును దెబ్బతీసే కుట్రలు..

పలువురు దుష్ప్రచారానికి తెరలేపుతున్న వైనం : కొంతమంది రిటైర్డ్ ఉద్యోగులు, మాజీ చైర్మన్లు కలిసి బ్యాంకును అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని చైర్మన్ ఆరోపించారు. బ్యాంకు అభివృద్ధి కోసం పనిచేస్తున్న వారిపై పనిగట్టుకుని దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. బ్యాంకును బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తున్న వారు వాస్తవాలను ప్రజలకు చెప్పాలని సవాల్ విసిరారు. గతంలో పీడీసీసీ బ్యాంక్ చైర్మన్లుగా పాటిబండ్ల గోపాలస్వామి, దామచర్ల ఆంజనేయులు లాంటి వారు బ్యాంకు అభివృద్ధికి కృషి చేసిన విధంగానే. రైతులకు ఉపయోగపడే నిర్ణయాలు తీసుకుంటూ బ్యాంకును మరింత బలోపేతం చేస్తున్నామని డాక్టర్ కామేపల్లి సీతారామయ్య తెలిపారు. బ్యాంకు అభివృద్ధిని అడ్డుకోవాలని చూసినా, దుష్ప్రచారంతో ప్రతిష్టను దెబ్బతీయాలని ప్రయత్నించినా, వాస్తవాలు ప్రజల ముందు ఉంచుతామని చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య స్పష్టం చేశారు.



విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి

జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత

ఇచ్చిన మాట ప్రకారం 580 మార్కులు దాటిన ఒక్కో విద్యార్థికి రూ.20 వేలు, బెస్ట్ స్కూల్ హెడ్‌మాస్టర్‌కు రూ.1 లక్ష స్వంత నిధులు అందించిన ఎమ్మెల్యే కందుల

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జులై 24)



విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ఉపాధ్యా యులు, తల్లిదండ్రులు బాటలు వేయాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అన్నారు. మార్కాపురం పట్టణం లోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యా యుల ఆత్మీయ సమావేశం (మెగా పేటీఎం 4.0)లో మార్కా పురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో కలిసి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిరువురు ఎన్‌సిసి విద్యార్థుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం విద్యార్థులు తమ చప్పట్లతో వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక శక్తి కేంద్రమని, గుండెల్లో ధైర్యం కళ్ళ ముందు లక్ష మాత్రమే కనపడాలని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలు, వసతులను సద్వినియోగం చేసుకొని అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ ఏడాది 10 వ తరగతి ఫలితాల్లో మార్కాపురం జిల్లా రాష్ట్రంలో 3 వ స్థానంలో నిలవడం ఉపాధ్యాయుల కృషికి నిదర్శనమని తెలిపారు. అదేవిధంగా విద్యార్థుల తల్లిదండ్రులు లీవ్ యాప్ ను కచ్చితంగా డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. దీని ద్వారా విద్యార్థుల పూర్తి సమాచారం తెలుసుకోవచ్చన్నారు. మరో అతిథి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో మార్పు కోసం తల్లిదండ్రులు ఉపాధ్యాయులను *(తరువాయి 4లో...)*

అద్భుతమైన గురుకులంగా తీర్చిదిద్దుతాం

ప్రతి విద్యార్థినినీ ఉన్నతంగా తీర్చిదిద్దాలనేదే ప్రభుత్వ ధ్యేయం

తల్లికి వందనం పథకంతో విద్యార్థుల తల్లులకు నేరుగా ఆర్థిక సాయం

1,335 మంది తల్లుల ఖాతాల్లో రూ.2,59,35,000 జమ

రక్షిత మంచినీటికి 1000 లీటర్ల ప్లాంట్, సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణానికి ఆదేశం

పర్చూరు నియోజకవర్గంలో మెగా పీటీఎం,

పాఠశాల అభివృద్ధిపై సమీక్షలో ఎమ్మెల్యే ఏలూరి





(షణ్ముఖ వెలుగు, యద్దనపూడి, జులై 24)

ప్రతి విద్యార్థి తన ఎంచుకున్న రంగంలో అత్యున్నత స్థాయికి చేరుకోవాలన్నదే తమ లక్ష్యమని, ఆ దిశగా ప్రతి పాఠశాలనూ అద్భుతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. శుక్రవారం యద్దనపూడిలో పర్చూరు నియోజకవర్గం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత సరస్వతీ దేవి చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం విద్యార్థులు ఎమ్మెల్యే ఏలూరికి ఆటపాటలతో ఘనస్వాగతం పలికారు. సందర్భంగా విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన తల్లికి వందనం పథకాన్ని విద్యార్థులు తల్లిదండ్రుల వివరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థి జీవితంలో తరగతి గదే బలమైన పునాది అని, ఎంచుకున్న లక్ష్యం దిశగా నిరంతరం కృషి చేయడమే ప్రతి విద్యార్థి కర్తవ్యమని పేర్కొన్నారు. తరగతి గదుల్లో ఎదురయ్యే ప్రతి సమస్యనూ పరిష్కరించి, విద్యార్థులకు ఆదర్శంగా నిలిచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. తాను ఈ స్థాయికి చేరుకోవడం వెనుక తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆశీస్సులే కారణమని, వారి పట్ల తనకు ఎనలేని కృతజ్ఞత ఉందని తెలిపారు.

తల్లికి వందనం పథకంతో ఆర్థిక సాయం... నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వెల్లడించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రవేశపెట్టిన వినూత్న కార్యక్రమాల్లో భాగంగా ప్రతి విద్యార్థికి 'తల్లికి వందనం' *(తరువాయి 4లో...)*

ఎల్‌నినో ప్రభావం పై ముందస్తు చర్యలకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

జిల్లా కలెక్టర్ పి రాజాబాబు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 24)



జిల్లా పై ఎల్‌నినో ప్రభావం రాబోతున్నందున ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యల పై సంబంధిత అధికారులు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పి రాజబాబు అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో యల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు అధిక నీటిని వినియోగించే పంటల వైపు పోకుండా నీటిని తక్కువగా వినియోగించే పంటల వైపువి మొగ్గు చూపేలా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులలో అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. రానున్న రెండు మూడు నెలలలో యల్‌నినో ప్రభావం ఉండనున్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలి అన్నారు. ముఖ్యంగా ప్రైమరీ సెక్టర్ కి సంబంధించిన అధికారులు నిర్దిష్ట ప్రణాళికలు రూపొందించి తదనుగుణంగా కార్యచరణ చేపట్టాలన్నారు. ముందు నుంచే సన్నద్ధతగా ఉండాలన్నారు. మత్స్య శాఖకు సంబంధించి కొత్త చేపల చెరువులు ఏర్పడ కుండా చూడాలన్నారు. కేనాల్స్ ద్వారా నీటిని అందించే చేపల చెరువులను ప్రోత్సహించ వద్దని ఆయన అధికారులకు సూచించారు. త్రాగునీటి సమస్య రాకుండా చూడాలని గుండ్లకమ్మ నది నుండి కెనాల్ ద్వారా చెరువులను నీటితో నింపాలని సూచించారు. నీటి డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని తగు చర్యలు తీసుకోవాలని *(తరువాయి 4లో...)*

పంపకాల వ్యత్యాసాల వల్లనే

గల్లా, కందుల మధ్య విభేదాలు

మేము అధికారంలోకి వస్తే ప్రజల ఆకాంక్షల మేరకు కలెక్టరేట్ ను మారుస్తాం

గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైసీపీ ఇన్‌ఛార్జి అన్నా వెంకట రాంబాబు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జులై 24)



బ్రమర టౌన్ షిప్ పంపకాల వ్యత్యాసాల వల్లనే గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి భర్త గల్లా రామచంద్రారావు, స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిల మధ్య విభేదాల నేపధ్యంలోనే ఒకరిపై మరొకరు విమర్శలను చేసుకుంటున్నారని నియోజకవర్గ వైసిపి ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు కూటమి నేతల వ్యవహార శైలిపై ధ్వజమెత్తారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యాపారపరంగా ఎవరైనా ఎక్కడికైనా వెళ్ళి వ్యాపారాలు చేసుకోవచ్చని, అయితే బ్రమర టౌన్ షిప్ పరిధిని దాటి, మార్కాపురం చెరువును అనుకుని వెంచర్ నిర్మించారన్నారు. అదే సందర్భంలో చెరువును అన్యాక్రాంతం చేసి పర్యావరణాన్ని మంటగలిపారని ఆరోపించారు. చెరువు కాలువ వద్ద బ్రిడ్జి నిర్మించే హక్కు ఎవరిచ్చారని ఆయన అధికారులను ప్రశ్నించారు. బ్రమర టౌన్‌షిప్‌లో ప్లాట్ కొనుగోలు చేసిన వినియోగదారులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, వారికి భరోసా కల్పించి, నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. నూతన మార్కాపురం జిల్లా ఏర్పాటును తాము కూడా స్వాగతించామని అయితే పట్టణం నుండి కలెక్టరేట్‌కు చేరుకోవాలంటే ప్రస్తుతం 7 కిలో మీటర్ల ప్రయాణించ వలసి వస్తోందని, దీన్ని ప్రజలు హర్షించడం లేదన్నారు. తాము అధికారంలోకి రాగానే ప్రజల ఆకాంక్షల మేరకు కలెక్టరేట్ నిర్మాణ పనులను మార్కెట్ కమిటీ యార్డ్ వద్ద గాని, ఆర్డీవో కార్యాలయంలో గాని నిర్మిస్తామని ఆయన జిల్లా ప్రజలకు హామీ ఇచ్చారు. బ్రమర టౌన్ షిప్ లో నివాస స్థలాలు కొనుగోలు చేసిన వినియోగ దారులకు తాను అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు. అధికారులు తమ బాధ్యతలను మరచిపోయి అధికారపార్టీ నాయకులకు జేజేలు చేస్తున్నారని, అధికారం శాశ్వతం కూడా కాదని మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. ఎమ్మెల్యే స్థాయిలో ఉన్న కందుల నారాయణరెడ్డి తనపై వ్యక్తిగత విమర్శలు చేయడం మంచిది కాదన్నారు. పద్ధతులు మార్చుకోవాలని హితవు పలికారు. ఈ విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర సెక్రెటరీ డాక్టర్ మీర్జా షశీషీర్ ఆలీబెగ్, పార్టీ అధ్యక్షులు ఎస్ కె. సలీమ్, మాజీ వ్యవసాయ కమిటీ చైర్మన్ గోలమరి శ్రీనివాస్ రెడ్డి, ఆ పార్టీ సర్ విభాగం జిల్లా కన్వీనర్ పత్తి రవిచంద్ర, ఎంపిపి లు ఎస్.సుబ్బారెడ్డి,బండి లక్ష్మీ దేవి, మండల పార్టీ అధ్యక్షుడు లయోలా చెంచి రెడ్డి, నియోజక వర్గ పార్టీ వాణిజ్య విభాగం అధ్యక్షులు బొగ్గరపు శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు తల్లిదండ్రుల పర్యవేక్షణే కీలకం

సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కృషితో కార్పొరేట్ స్థాయికి ప్రభుత్వ బడులు

ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆదేశాలతో విద్యాభివృద్ధికి పెద్దపీట

తలార్లపల్లె ఎంపీపీ పాఠశాలలో ఘనంగా పీటీఎమ్

వినుకొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ మీసాల మురళీకృష్ణ యాదవ్





(షణ్ముఖ వెలుగు, నూజండ్ల, జులై 24)

విద్యార్థులసర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని వినుకొండ వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ మీసాల మురళీకృష్ణ యాదవ్ అన్నారు. పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం తలార్లపల్లె గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక (ఎంపీపీ) పాఠశాలలో శుక్రవారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం (పీటీఎమ్) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మోతడక వీరాచారితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మీసాల మురళీకృష్ణ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ల దార్శనికతతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని కొనియాడారు. వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని పాఠశాలల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దుతున్నామని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు సైతం అంకితభావంతో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతున్నారని ప్రశంసించారు. అయితే, పిల్లలు ఇంటికి వెళ్లిన తర్వాత వారి చదువుల పట్ల తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా పీటీఎమ్ సమావేశాలకు హాజరై, తమ పిల్లల ప్రవర్తన, చదువులో వారి పురోగతి గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని ఆయన కోరారు. అనంతరం విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మోతడక వీరాచారి మాట్లాడుతూ.. విద్యతోనే పేదరికం నిర్మూలన సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ఉన్నతంగా చదివించుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. వెంకట నరసయ్య విద్యార్థుల ప్రగతి నివేదికలను తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ముఖ్య అతిథులు, నాయకులు విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు గుడిపూడి యేసురత్నం, కిట్టయ్య, పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, వెంకటరావు, శ్వేత, ఏఎన్ఎం శ్రీలత, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

పాత కక్షలతో దాడి – వ్యక్తి మృతి



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జులై 24)

పాత కక్షలతో ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన సంఘటన గురువారం రాత్రి మండలంలోని సంతరావురు గ్రామంలో వెలుగు చూసింది. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం సంతరావురు గ్రామనికి చెందిన అతిన శ్రీనివాసరావు గొర్రెలు మేపుతూ జీవనం సాగించేవాడు. కుటుంబ కలహాల కారణంగా గత ఒక సంవత్సరం నుండి తన భార్యకు దూరంగా విడిగా నివసిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఉప్పల వెంకట నారాయణ, కొత్తగోర్ల సుబ్రహ్మణ్యం, చెకూరి బాలరాం కలిసి మృతునితో గొడవపడి, పూర్వ కక్షతో కర్రలతో విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ దాడిలో మృతుని ముఖం, కడుపు, కాళ్ల పై తీవ్ర రక్తగాయాలు కావడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు.దీంతో సమాచారం అందుకున్న పోలీసులు ఇంకోల్లు సిఐ అధ్వర్యంలో మండల ఎస్ఐ సంఘటన స్థాలనికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి











ఒకే వేదిక మీదకు తీసుకురావడం అభినందనీయమని కొనియాడారు. విద్యారంగంలో సమూల మార్పులు తీసుకువచ్చి తమ ప్రభుత్వం విద్యార్థులు భవిష్యత్తుకు అండగా నిలుస్తుంది అన్నారు. గత సంవత్సరం చెప్పిన మాట ప్రకారం నియోజకవర్గంలో 580 పైగా మార్కులు సాధించిన 12 మంది 10వ తరగతి విద్యార్థులకు రూ. 20 వేల చొప్పున ఎమ్మెల్యే సొంత నగదును అందజేసి అభినందించారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ మార్కాపురం పట్టణ, పరిసర ప్రాంతాల్లో మార్కాపురం జడ్పీ బాయ్స్ హై స్కూల్, జడ్పీ గర్ల్స్ హై స్కూల్,ఏబీఎం హైస్కూల్ ఉన్నాయని కొందరి స్వార్థపరుల కుట్రల వల్ల ఏబీఎం హై స్కూల్ మూత పడిందన్నారు. ఈ మధ్యనే ఆ స్కూలును అందరి సహకారంతో ఆ క్యాంపస్‌లోకి ప్రవేశించామన్నారు. త్వరలోనే ఆ స్కూలు తిరిగి తెరపించి విద్యార్థులకు విద్యాదానం చేస్తామన్నారు. భవిష్యత్తులో ఈ మూడు స్కూళ్లను పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తామని అన్నారు. ఒకప్పుడు మార్కాపురంలో త్రాగునీటికి కూడా ఇబ్బందులు పడి బిందెలు పట్టుకొని రోడ్ల మీదకి వచ్చిన రోజులు ఇంకా గుర్తున్నాయన్నారు. ఈ వెనుకబాటుతనాన్ని కొంతవరకు రూపుమాపగలిగామని, త్వరలో పూర్తిస్థాయిలో మార్కాపురాన్ని అభివృద్ధి చేస్తానని అన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు మదిలో పుట్టిన కొత్త ఆలోచన లీఫ్ స్కూల్స్ కాన్సెప్ట్ అని, రాష్ట్రంలోనే తొలిసారిగా గుంటూరు జిల్లా మంగళగిరి మండలంలోని నిడమర్రు గ్రామంలో జడ్పీహెచ్ఎస్ ను పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని సుమారు రూ.16 కోట్ల బడ్జెట్ కేటాయించి అంతర్జాతీయ ప్రమాణాలతో ఆ స్కూలు అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. అంతేగాక రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలో ప్రతి నియోజకవర్గానికి ఒక లీప్ స్కూల్ ప్రతిపాదనలు కూడా సిద్ధం చేసిందన్నారు. తద్వారా మార్కాపురం నియోజకవర్గంలోని ఈ జెడ్పి బాయ్స్ హై స్కూల్ కూడా లీప్ స్కూల్ గా ప్రకటించి కొన్ని కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తామన్నారు. పిల్లల భవిష్యత్తు పై తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, మంచి నడవడిక విద్యార్థులకు నేర్పితే క్రమశిక్షణతో చదివి ప్రతి ఇంటి నుండి ఒక డాక్టర్, ఒక ఇంజనీర్, ఒక ఐఏఎస్ తయారవుతారన్నారు. ఈ ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా కట్టుబడి ఉందని, ఇప్పటికే మార్కాపురం ప్రత్యేక జిల్లా సాధించి అభివృద్ధి పథంలో ఉన్నామని, త్వరలోనే వెలుగొండ ప్రాజెక్ట్ ను పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్ గా మారుస్తామన్నారు. తద్వారా రైతులకు ఒక ఎకరానికి లక్షల రూపాయల ఆదాయం వస్తుందన్నారు. అతి త్వరలోనే మార్కాపురం నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి త్రాగునీటి పైప్ లైన్ కనెక్షన్ ఇస్తామని, తద్వారా ప్రతి ఇంటికి సాగరు నీటిని అందిస్తామన్నారు. గత సంవత్సరం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ సందర్భంగా మాట ఇచ్చిన మార్కాపురం నియోజకవర్గంలో 580 మార్కుల పైబడిన విద్యార్థులకు క్యాష్ ప్రైజ్ అందిస్తానని, ఎక్కువ మార్కులు సాధించిన హై స్కూల్ హెడ్మాస్టర్ కు లక్ష రూపాయల నగదు బహుమతి అందిస్తానని ఇచ్చిన మాట కట్టుబడి శుక్రవారం విద్యార్థులకు కాష్ ప్రైజ్‌ను జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత చేతుల మీదుగా అందించారు. 580 మార్కులకు పైబడి క్యాష్ ప్రైజ్ పొందిన వారిలో వైవి సాయి చందన, షేక్ ఫరహన, ఏ హనీఫా, ఎస్‌కె రుక్సానా, ఎం బాలవెంకటేశ్వర్లు, బి నాగ వెంకట ప్రణీత్, కే నవీన్, ఎస్ హేమలత, డి వీరాంజనేయులు, ఎస్ కె మహిన్, కే సౌజన్య, దారెడ్డి వెలుగొండరెడ్డి, తదితర విద్యార్థులు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా నగదు బహుమతి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఇఓ సుబ్బారావు, ఆర్డిఓ వెంకట శివరామిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావం పై ముందస్తు చర్యలకు ప్రణాళికలు సిద్ధం చేయాలి



సూచించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న మండలాలను గుర్తించి ఆయా ప్రాంతాలలో బోర్లు వేసే విధంగా తగిన అనుమతులు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. ముఖ్యంగా ప్రజలలో అవగాహన కల్పించే విధంగా విస్తృత ప్రచారం చేయాలని టామ్ టామ్ ను వేయించాలని. కరపత్రాలను ముద్రించి ఇంటింటికి అందించాలని అన్నారు. నీటిని వృధా కానీయకుండా దానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అధికారులందరూ సమిష్టి కృషితో పనిచేసి జిల్లాపైయల్నినో ప్రభావం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ముఖ్యంగా నీటిని లీకేజీని అరికట్టాలని అవసరమైన ట్యాపులను రిపేర్లు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో చిరంజీవి, డిపిఓ అనుపమ, డిఆర్‌డిఎ పి డి నారాయణ, డ్వామా పిడి జోసెఫ్, నగరపాలక సంస్థ కమిషనర్ వెంకట కృష్ణయ్య, వ్యవసాయశాఖ జెడి శ్రీనివాసరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అద్భుతమైన గురుకులంగా తీర్చిదిద్దుతాం

పథకాన్ని అమలు చేస్తున్నామని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని పూర్తి స్థాయిలో నెరవేర్చామని తెలిపారు. పర్చూరు నియోజకవర్గంలో మొత్తం 25,963 మంది విద్యార్థులు ఈ పథకం పరిధిలోకి రాగా, తాజాగా 1,335 మంది తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.2,59,35,000 జమ చేసినట్లు ఎమ్మెల్యే వివరించారు. ఈ మొత్తాన్ని పిల్లల చదువుల కోసమే వినియోగించుకోవాలని తల్లులకు సూచించారు.

రక్షిత మంచినీటికి ప్రత్యేక ఏర్పాట్లు...

విద్యార్థులకు రక్షిత మంచినీరు అందించే లక్ష్యంతో పాఠశాలలో 1000 లీటర్ల సామర్థ్యం గల మంచినీటి ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు.

సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణానికి ఆదేశం

పాఠశాల ప్రాంగణంలో రాకపోకలకు ఇబ్బంది లేకుండా సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని ఆయన అధికారులకు స్పష్టం చేశారు.

క్యాంటీన్, హాస్టల్ పరిశీలన...

కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే క్యాంటీన్, డైనింగ్ హాలు, హాస్టల్ గదులను స్వయంగా పరిశీలించారు. విద్యార్థినులకు అందించే భోజన నాణ్యత, పరిశుభ్రతపై ఆరా తీశారు.

పచ్చదనంతో పాఠశాల ముస్తాబు

పాఠశాల ప్రాంగణం పచ్చదనంతో ఉట్టిపడేలా ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటాలని ఎమ్మెల్యే సూచించారు. పండ్ల మొక్కలతో పాటు నీడనిచ్చే మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని డ్వామా అధికారులను ఆదేశించారు.

శానిటైజేషన్, సురక్షిత నీటిపై ప్రణాళికలు

పాఠశాలలో శానిటైజేషన్‌తో పాటు సురక్షిత నీటి సరఫరాకు తగిన ప్రణాళికలు రూపొందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో నియోజకవర్గ ప్రత్యేక అధికారి లవన్న, డ్వామా పిడి విజయలక్ష్మి, ఎంఈఓ లు సుబ్రహ్మణ్యం, గోపి ,ఎంపీడీవో శ్రీనివాసరావు , తాసిల్దార్ రవి కుమార్, ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి, నాయకులు కనపర్తి నాగేశ్వరావు, తారక రామారావు, సతీష్, నారాయణ స్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, వివిధ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్, స్కీం వర్కర్స్‌కి రూ.26,000 ఇవ్వాలి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 24)

షెడ్యూలు పరిశ్రమలోని కార్మికులకు, ప్రభుత్వ రంగ సంస్థ కాంట్రాక్ట్ ఔ ట్సోర్సింగ్, స్కీం వర్కర్స్ కి రూ.26,000 ఇవ్వాలని. జూలై 30, 31 తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా జయప్రదం చేయాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో మోటర్ సైకిల్ ప్రచార జాత నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా షెడ్యూల్ 15 సంవత్సరాలలో కార్మికులకు వేతనం పెంచలేదు ఏ ప్రభుత్వం అధికారంలో వచ్చిన ప్రవేట్ యాజమాన్యాలు లాభాలు సమకూర్చే ప్రభుత్వాలు చట్టాలు ఏర్పాటు చేస్తున్నాయి. కనీసం షెడ్యూల్ పని చేసే కార్మికులకు రూ.12,800 నుండి 16,000 వరకు వేతనాలు ఇస్తున్నారు. వీళ్ళకి ఎలాంటి కార్మిక చట్టాలు లేదు మరియు కనీస వేతనం సౌకర్యాలు కల్పించట్లేదు ఉపాధి భద్రత ఉండట్లేదు, వేల తరబడి అతి తక్కువ వేతనంలతో కార్మికులు జీవన ఉపాధి కొనసాగిస్తున్నారు. నిత్యవసరలో ధరలు ఒక వైపు రోజు పెరిగిపోతున్న కార్మికులకు వేతనం మాత్రం 15 సంవత్సరాల క్రితం ఏ వేతనాలు ఉన్నాయో అవే వేతనాలు కొనసాగుతా ఉన్నాయి. ప్రభుత్వ రంగ సంస్థల పని చేస్తున్న కౌన్సిల్ ఉద్యోగస్తులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయాలని చెప్పినా కూడా రాష్ట్ర ప్రభుత్వం కాని ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా సౌకర్యాలు కల్పించకుండా విధులు నిర్వహిస్తున్నారు. ఆంధ్ర కార్మికులకు, కాంట్రాక్ట్ కార్మికులకు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులకు కనీస వేతనం ఇవ్వాలని, రెగ్యులర్ చేయాలని, స్కీమ్ వర్కర్స్, ఆశ, అంగన్వాడి, వీఆర్ఏ, వీఆర్వో, మిడ్‌డే మిల్స్, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ స్కీంలో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు, సంక్షేమ పథకాల అమలు కాక అతి తక్కువ జీవనం కొనసాగిస్తూ ఉన్నారు. షెడ్యూల్ పరిశ్రమలో కార్మికులకు, రాష్ట్ర ప్రభుత్వం సంస్థలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, స్కీం వర్కర్స్‌కు కనీసం రూ.26,000 వేతనం ఇవ్వాలని, జులై 30, 31 తేదీన జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద పెద్ద సంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు పాల్గొని ధర్నా జయప్రదం చేయాలని, సమస్యలు పరిష్కారం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు ఒంగోలు నగర కన్వీనర్ టి మహేష్ మాట్లాడుతూ మోటార్ సైకిల్ ప్రచార జాతలో భాగంగా కార్మికులు పని ప్రదేశాల్లో వారి సమస్యలను అధ్యయనం చేస్తూ, వాళ్లకు కనీస వేతనాలు అమలు చేయాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని నగరంలో గిగ్ వర్కర్స్, ముఠా కార్మికులకు, ఆటో కార్మికుల, సివిల్ సప్లై ముఠా, చెత్త సేకరణ కార్మికులు, రవాణా రంగంలో మెకానిక్ కార్మికులు, షాపింగ్ మాల్స్, పరిశ్రమలో పనిచేసే కార్మికులకు ప్రచార క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఒంగోలు నగర నాయకులు బివి రావు, జి రమేష్, తంబి శ్రీనివాసులు, ఎస్‌డి హుస్సేన్, దామా శ్రీనివాసులు, సిహెచ్ రాంబాబు, బావన్నారాయన, మాలకొండయ్య, జి నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

పెట్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో వైభవంగా మెగా పేటీఎం 4.0

విద్యారంగ సంస్కరణల పై దిశానిర్దేశం చేసిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి









(షణ్ముఖ వెలుగు, కొండపి, జులై 24)

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర సాంఫీక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి అన్నారు. మండలంలోని పెట్లూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెగా పేరెంట్ – టీచర్స్ మీటింగ్ 4.0 కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాలకు చేరుకున్న మంత్రి ముందుగా పాఠశాల ఆవరణలోని సరస్వతి దేవి విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎంతో ప్రతిభతో తయారుచేసిన బోధనా అభ్యసన సామగ్రి, స్టాళ్లను, అధునాతన డిజిటల్ ప్రదర్శనలను క్షుణ్ణంగా పరిశీలించి విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ భారతదేశానికి అవసరమైన అత్యంత విలువైన మానవ వనరులు మన విద్యార్థులేనని, రాష్ట్ర భవిష్యత్తుకు వారే అసలైన రథసారథులని తెలిపారు. తమ పిల్లలు పాఠశాలల్లో ఎలా చదువుతున్నారు, ప్రభుత్వం అందిస్తున్న మౌలిక వసతులు వారికి సరిగ్గా అందుతున్నాయా లేదా అనే విషయాలను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పాఠశాలకు వచ్చి పరిశీలించుకోవాలని కోరారు. బడుల్లో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం నేరుగా ఫోన్ కాల్స్ చేసి వివరాలు తెలుసుకుంటోందని, విద్యార్థుల చదువు పై కూటమి ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధకు ఇది ప్రత్యక్ష నిదర్శనమని ఆయన అన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తూ అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నామని మంత్రి వెల్లడించారు. ఏ ఒక్క విద్యార్థి కూడా కుటుంబ ఆర్థిక పరిస్థితుల వల్ల చదువు మధ్యలో మానేయకూడదని పిలుపునిచ్చారు. ఈ సందర్భంలో గతంలో పదో తరగతి మధ్యలో చదువు ఆపేసి, తిరిగి ఇప్పుడు పెట్లూరు పాఠశాలలోనే 10వ తరగతిలో చేరిన 'వినయ్' అనే విద్యార్థిని మంత్రి ప్రత్యేకంగా వేదికపైకి పిలిచి అభినందించారు. ప్రతి ఒక్కరూ చదువుకుని ప్రభుత్వ లేదా ప్రైవేట్ రంగాల్లో ఉన్నత ఉద్యోగాలు సాధించాలి తప్ప, ఎవరూ కూలి పనులకు వెళ్లే పరిస్థితి రాకూడదని మంత్రి స్వామి ఆకాంక్షించారు. పాఠశాలల్లో విద్యా బోధనను సమర్థవంతంగా అమలు చేసేందుకు విద్యార్థులకి, ఉపాధ్యాయులకి మ్యాపింగ్ చేసి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. పదో తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను సమర్థవంతంగా అమలు చేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ క్రమంలో ప్రతీ రోజు ఉదయం 4.30 గంటలకే ఫోన్ చేసి నిద్రలేపి పదో తరగతి విద్యార్థులను చదివిస్తున్న ఒక గణిత ఉపాధ్యాయుడిని మంత్రి అభినందించారు. ప్రతీ ఉపాధ్యాయుడు ఇదే రకమైన బాధ్యతతో పనిచేయాలని కోరారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థికి పుస్తకాలు, బ్యాగ్, యూనిఫాం, షూస్ వంటి సామగ్రితో కూడిన 'డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కిట్'ను సకాలంలో అందజేస్తోందన్నారు. అలాగే విద్యార్థులకు నిత్యం పరిశుభ్రమైన, పోషకాలతో కూడిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని వివరించారు. కొండేపి హైస్కూల్‌ను లీఫ్ స్కూల్‌గా ఎంపిక చేశామని, రాబోయే రోజుల్లో విడతల వారీగా అన్ని పాఠశాలల్లోనూ విధానాన్ని అమలు చేస్తామన్నారు. పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దే 'ముస్తాబు' కార్యక్రమంతో పాటు, పిల్లల ఒత్తిడి తగ్గించే 'నో బ్యాగ్ డే' లను పక్కాగా నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. విద్యార్థుల రక్షణ, ఆరోగ్యం విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, పాఠశాలల్లో పిల్లలకు 'గుడ్ టచ్-బ్యాడ్ టచ్' పై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మాదక ద్రవ్యాల బారిన పడకుండా "డ్రగ్స్ వద్దు – బ్రో" పేరుతో విద్యార్థులకు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా 'నెట్ జీరో' విధానాన్ని అమలు చేస్తూ ప్రతి పాఠశాలలో సోలార్ ప్యానెళ్లను బిగిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిభ కలిగిన విద్యార్థుల కోసం 10 చీజుజు , కోచింగ్ సెంటర్లతో పాటు ఎక్సలెన్సీ సెంటర్లను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. దివ్యాంగులైన (చెవిటి, మూగ, అంధత్వ) విద్యార్థుల కోసం ప్రత్యేక విద్యా సంస్థలను నడుపుతున్నామని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారి ప్రత్యేక చొరవతో సీఎం గారు ఆలోచించి, చూపు లేని విద్యార్థుల కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేలా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఒక సబ్జెక్టుగా ప్రవేశపెట్టేందుకు శ్రద్ధ వహించారని చెప్పారు. ఇటీవల మంగళగిరిలో విద్యాశాఖ మంత్రి లోకేష్ గారు 'షైనింగ్ స్టార్స్ అవార్డ్స్' నిర్వహించారని, అందులో భాగంగా మన జిల్లాలో కూడా ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు పురస్కారాలు (ఙుంష్ణ ూాఘుతీఎం) అందించామని గుర్తుచేశారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని ఈ స్థాయికి వచ్చానని మంత్రివర్యులు తెలిపారు. ఈనాడు విదేశాలలో, ఉన్నత పదవుల్లో స్థిరపడిన ఎంతో మంది నిపుణులు ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నవారేనని చెప్పారు. ప్రతి పాఠశాలలోనూ విలువలతో కూడిన గుణాత్మక విద్యను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. అనంతరం మంత్రివర్యులు స్వయంగా విద్యార్థులతో కలసి "డోకా సీతమ్మ మధ్యాహ్న భోజనం" చేశారు. భోజనం నాణ్యతను, రుచిని స్వయంగా పరిశీలించి విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మానాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, ఒంగోలు ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, సమగ్ర శిక్ష జిల్లా కో-ఆర్డినేటర్ డి అనిల్ కుమార్, తహసీల్దార్ శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, పెద్ద ఎత్తున తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీజేపీలోకి 20 కుటుంబాల చేరిక

మార్కాపురంలో పార్టీ బలోపేతమే లక్ష్యం

జిల్లా పార్టీ అధ్యక్షులు పివి కృష్ణారావు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జులై 24)

మార్కాపురం జిల్లా బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పార్టీకి ఊపందించే విధంగా కొత్త సభ్యుల చేరిక కార్యక్రమం జరిగింది. జిల్లా అధ్యక్షులు పీవీ కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కంభం ప్రాంతానికి చెందిన 20 కుటుంబాలు భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ చేరిక కార్యక్రమాన్ని పార్టీ నాయకుడు జక్కి కరుణాకర్ సమన్వయం చేశారు. పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలను ఆకర్షిస్తున్నాయని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖంగా పార్టీలో చేరిన వారిలో కాసుల అంజనీకుమార్, పీక్కిలి వెంకట శివ ప్రసాద్, మంతా శ్రీనివాస్, ఆకుల రామాంజినేయులు తదితరులు ఉన్నారు. వీరికి పార్టీ కండువాలు కప్పి జిల్లా అధ్యక్షులు స్వాగతం పలికారు. జిల్లా అధ్యక్షులు పీవీ కృష్ణారావు మాట్లాడుతూ, బీజేపీ విధానాలపై విశ్వాసంతో ప్రజలు స్వచ్ఛందంగా పార్టీలో చేరడం సంతోషకరమని తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేయాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పని చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

భీమవరం జిల్లా పరిషత్ హై స్కూల్లో ఘనంగా మెగా పిటిఎం 4.0





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 24)

భీమవరం జడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం ప్రధానోపాధ్యాయులు బండి సుబ్బారావు ఆధ్వర్యంలో తల్లిదండ్రుల ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ముందుగా పాఠశాలకు విచ్చేసిన తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులు తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు గత సంవత్సర విద్యార్థుల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు అనంతరం జరిగిన సభకు ప్రధానోపాధ్యాయులు బండి సుబ్బారావు అధ్యక్షత వహించగా తల్లి దండ్రుల కమిటీ సభ్యులు మంజుల, వినోద, రజిని, పాఠశాల శ్రేయోభిలాషులు చలపతి, విజయ్ కుమార్, శివ, అమర్నాథ్, రామాంజనేయులు లు పాల్గొని విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం అందించే సహాయ, సహకారాలను అందిపుచ్చుకొని విద్యలో మంచి ఉన్నతమైన స్థాయిని అందుకొని పాఠశాలకు తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తేవడంతో పాటు దేశ అభివృద్ధిలో తమ వంతు పాత్ర నిర్వహించాలని విద్యార్థులకు ఉద్బోధించారు. మేడికొండ భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలల కన్నా మెరుగైన ఉన్నతమైన విలువలతో కూడిన విద్యా, పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనం, విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు యూనిఫాం అన్ని ప్రభుత్వమే సమకూరుస్తున్నందున విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థుల భవిష్యత్తు పట్ల శ్రద్ధ వహించాలని కోరారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన విందు భోజనం విద్యార్థులు తల్లిదండ్రులు ఆరగించడంతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఫస్ట్ అసిస్టెంట్ శివరామయ్య, అంకయ్య, శ్రీధర్, మస్తాన్ వలి, హేమలత, చిట్టీబాబు, సుబ్బారావు సిబ్బంది హనుమంతరావు, బుజ్జయ్య పాల్గొనగా మొత్తం కార్యక్రమంను మేడికొండ భాస్కర్ పర్యవేక్షించారు.

నగరంలోని కొత్త కూరగాయల మార్కెట్ షాదీ ఖానా ప్రాంతంలో అగ్నిప్రమాదం

సుమారుగా 12 లక్షల రూపాయలు నష్టం





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 24)

నగరంలోని కొత్త కూరగాయల మార్కెట్ షాదీ ఖానా ప్రాంతంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. యజమాని పెద్దిరాజు తెలిపిన వివరాల ప్రకారం టెంపో వాహనం మరమ్మత్తులు బ్యాటరీలు మార్చడం జరిగిందినీ వెనక ఉన్న టూరిస్ట్ బస్సుకు బ్యాటరీ బిగిస్తుండగా టెంపో వాహనం నుండి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయని అన్నారు. వెంటనే అగ్నిమాపక శాఖ కు సమాచారం ఇవ్వటంతో, వెంటనే వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసిందని అయినా టెంపో వాహనం పూర్తిగా, ట్రావెల్స్ బస్సు ముందు భాగం దగ్ధమైందని సుమారుగా 12 లక్షల రూపాయలు నష్టం జరిగిందని ట్రావెల్స్ బస్ యజమాని తెలిపారు.

రాగి వైర్ల దొంగల ముఠా అరెస్టు

328 కిలోల రాగి వైరు, మోటార్ సైకిల్ స్వాధీనం

మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడించిన మార్కాపురం డిఎస్పీ యు నాగరాజు

(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, జులై 24)

పెద్దారవీడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి వాటిలోని రాగి వైర్లను దొంగిలిస్తున్న ఘటనల పై నమోదైన కేసులను జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు తన పర్యవేక్షణలో పెద్దారవీడు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం సైదుబాబు ప్రత్యేకంగా దర్యాప్తు చేపట్టినట్లు మార్కాపురం డిఎస్పీ యు నాగరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. దర్యాప్తులో భాగంగా శుక్రవారం 9.20 గంటల సమయంలో గొబ్బూరు గ్రామం వద్ద గల ఎన్ఎస్ అగ్రికల్చరల్ కాలేజీ వద్ద నలుగురు వ్యక్తులు పోలీసులను తప్పించుకోవాలని చూశారు. ఈ సందర్భంగా వారు మోటర్ సైకిళ్ళను అక్కడే వదిలి పారిపోవడానికి ప్రయత్నించగా పోలీసులు వెంటాడి పట్టుకోవడం జరిగిందన్నారు. విచారణలో వారు పాశం యల్లయ్య, పాలగిరి వెంకటనారాయణరెడ్డి, గంగిరెడ్డి చిన్న అంజిరెడ్డి, కనిగిరి శివ శంకర్‌లుగా గుర్తించడం జరిగిందన్నారు. విచారణలో నిందితులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఒక ముఠాగా ఏర్పడి పెద్దారవీడు, త్రిపురాంతకం, ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాలలోని వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి వాటిలోని రాగి వైర్లను దొంగిలించి విక్రయిస్తూ అక్రమంగా డబ్బు సంపాదిస్తున్నట్లు అంగీకరించారని తెలిపారు. నిందితుల ఒప్పుకోలు మేరకు శుక్రవారం పెద్దారవీడు మండలం తోకపల్లి గ్రామ సమీపంలోని సుంకేసుల పునరావాస కాలనీలో గల ఒక గదిలో ఉన్న 10 తెల్ల గోనె సంచుల్లో నిల్వ ఉంచిన మొత్తం 328 కిలోల రాగి వైరును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆయా కేసుల వివరాలు ఈ క్రింద తెలిపిన విధంగా ఉన్నాయి. అదే విదంగా ఈ నెల 20వ తేదీ అర్ధరాత్రి వై.డి.పాడు (బోయదగుంపల) గ్రామ శివారులోని వ్యవసాయ పొలాల్లో ఉన్న బోరు మోటార్లకు అమర్చిన విద్యుత్ కేబుల్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు కత్తిరించి అపహరించినట్లు రైతులు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో పెద్దారవీడు పోలీసులు ప్రత్యేక దర్యాప్తు చేపట్టి, సాంకేతిక ఆధారాలు, గూఢచారుల సమాచారంతో పాటు స్థానికంగా విస్తృతంగా విచారణ నిర్వహించారు. ఈ క్రమంలో 23వ తేదీ సాయంత్రం దేవరాజుగట్టు జంక్షన్-దోర్నాల రోడ్డులోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా, వారు నేరాన్ని ఒప్పుకున్నారు. వారిలో షేక్ లాల్ జాన్ బాషా, షేక్ జానీ బాషా లు ఉన్నారు. విచారణలో నిందితులు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో రాత్రి వేళల్లో వ్యవసాయ బోరు మోటార్ల విద్యుత్ కేబుల్ వైర్లను దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. వారి చూపిన మేరకు దేవరాజుగట్టు గ్రామ సచివాలయం వెనుక పొదల్లో దాచిన సుమారు 75 మీటర్ల బోరు మోటార్ విద్యుత్ కేబుల్ వైర్లు (విలువ రూ.9,000) స్వాధీనం చేసుకోవడంతో పాటు, నేరానికి వినియోగించిన డీలక్స్ మోటార్ సైకిల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రాథమిక విచారణలో ఇదే నిందితులు పెద్దారవీడు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మరో కేబుల్ వైర్ల దొంగతనం కేసులో కూడా ప్రమేయం ఉన్నట్లు తేలిందన్నారు. నిందితులను అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి మార్కాపురం కోర్టులో రిమాండ్ నిమిత్తం హాజరుపరిచ వలసి ఉందన్నారు. ఈ కేసును ఛేదించడంలో విశేష కృషి చేసిన త్రిపురాంతకం సర్కిల్ ఇన్స్పెక్టర్ హసన్, పెద్దారవీడు ఎస్ఐ ఎం సైదుబాబు, అతని సిబ్బందిని జిల్లా పోలీసు అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.





పిల్లల బంగారు భవిష్యత్తు కోసం... బడివైపు ఒక అడుగు!







(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జులై 24)

పెద్ద ఇర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం కార్యక్రమంలో కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంటు టీడీపీ పార్టీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రగతి, క్రమశిక్షణ, నైపుణ్యాభివృద్ధి, భవిష్యత్ లక్ష్యాలపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఆత్మీయంగా చర్చించారు. ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే పాఠశాల, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది విద్య. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ పాఠశాలతో నిరంతర అనుసంధానంగా ఉండాలి. మన పిల్లల విజయమే మన సమాజ అభివృద్ధికి బాటలు వేస్తుంది అని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పేర్కొన్నారు.

ఒంగోలుకు ప్రత్యేక శిశు గుండె చికిత్స సేవలను తీసుకువచ్చిన విజయవాడ మణిపాల్ హాస్పిటల్





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 24)

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ప్రత్యేకమైన పిల్లల గుండె సంరక్షణ అందుబాటును బలోపేతం చేసేందుకు, మణిపాల్ హాస్పిటల్ విజయవాడ ఒంగోలులో తన ప్రత్యేక పీడియాట్రిక్ కార్డియాలజీ ,కార్డియోథొరాసిక్ , వాస్కులర్ సర్జరీ క్లినిక్ను ప్రారంభించింది అని ఒంగోలులోని కె.బి రెస్టారెంట్లో జరిగిన మీడియా సమావేశంలో డాక్టర్ లు వివరాలు వెల్లడించారు. వారు మాట్లాడుతూ పుట్టుకతో వచ్చే , తర్వాత సంక్రమించే గుండె జబ్బులతో బాధపడుతున్న పిల్లలకు నిపుణుల సంప్రదింపులు, ముందస్తు రోగ నిర్ధారణ మరియు అధునాతన చికిత్సను సజావుగా అందించడం ఈ క్లినిక్ లక్ష్యం. దీని ద్వారా ఒంగోలు ,సమీప జిల్లాల కుటుంబాలు తమ ఇంటికి దగ్గరలోనే ప్రత్యేకమైన సంరక్షణను పొందేందుకు వీలవుతుంది. మణిపాల్ హాస్పిటల్ విజయవాడలోని పీడియాట్రిక్ కార్డియాలజీ, సీటీవీఎస్ విభాగం, పుట్టుకతో వచ్చే గుండె సమస్యలు, పెరుగుతున్న దశలో, గుండె జబ్బులతో బాధపడే చిన్నారులకు సమగ్ర వైద్య సేవలు అందిస్తోంది. గర్భంలో ఉన్న శిశువు దశ నుంచే గుండె పరీక్షలు, నవజాత శిశువుల గుండె సమస్యల నిర్ధారణ, అత్యాధునిక క్యాథెటర్ ఆధారిత చికిత్సలు, పీడియాట్రిక్ గుండె శస్త్రచికిత్సలు, నవజాత శిశువులు ,చిన్నారుల కోసం ప్రత్యేక కార్డియాక్ ఐసీయూ సేవలు, లాంగ్ టర్మ్ ఫాలోఅప్ వరకు అన్ని సేవలు ఒకేచోట అందుబాటులో ఉన్నాయి. ఈ టీం ఇప్పటివరకు సుమారు 3,000 చిన్నారులకు గుండె శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించింది. అప్పుడే పుట్టిన శిశువుల నుంచి పెద్ద పిల్లల వరకు, పుట్టుకతో వచ్చే అన్ని రకాల గుండె సమస్యలకు చికిత్స అందించే అనుభవం ఈ బృందానికి ఉంది. అంతేకాకుండా ఏఎస్డీ,వీఎస్డీ ఎంపిక చేసిన టెట్రాలజీ ఆఫ్ ఫాలోట్ కేసులకు, మినిమల్లీ ఇన్వేసివ్ ట్రాన్స్ యాక్సిలరీ కార్డియాక్ సర్జరీని కూడా నిర్వహిస్తున్నారు. దీంతో ఛాతీపై పెద్దగా మచ్చ లేకుండా చిన్నారులు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది. అలాగే హార్ట్ ఫెయిల్యూర్ చివరి దశతో బాధపడుతున్న అర్హులైన చిన్నారులు, యువతకు హార్ట్ ట్రాన్స్ ప్లాంట్ సేవలు కూడా అందిస్తున్నారు. 20 కిలోల కంటే ఎక్కువ బరువున్న, ఎంపిక చేసిన చిన్నారులకు రోబోటిక్ కార్డియాక్ సర్జరీ నిర్వహిస్తూ, మరింత ఖచ్చితత్వంతో, చిన్న గాటు, కోతతో, వేగంగా కోలుకునేలా చికిత్స అందిస్తున్నారు. ఈ కార్యక్రమానికి డా. కె. విక్రమ్, సీనియర్ కన్సల్టెంట్ – ఇంటర్వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజీ, డా. దిలీప్ రట్టి – కన్సల్టెంట్ సీటీవీఎస్, అలాగే అనుభవజ్ఞులైన పీడియాట్రిక్ కార్డియాక్ సర్జన్లు, కార్డియాక్ అనస్థీషియా నిపుణులు, ఇంటెన్సివిస్టులు, ప్రత్యేక నర్సింగ్ టీం నాయకత్వం వహిస్తోంది. చిన్నారులకు సమగ్ర గుండె వైద్యం అందించేందుకు ఈ మల్టీడిసిప్లినరీ బృందం కలిసి పనిచేస్తోంది. డాక్టర్ దిలీప్ రట్టి మాట్లాడుతూ, “పుట్టుకతో వచ్చే గుండె సమస్యలను ముందుగానే గుర్తించి, సరైన సమయంలో చికిత్స అందిస్తే, చిన్నారులు పూర్తి ఆరోగ్యంతో జీవించే అవకాశాలు చాలా ఎక్కువ. ఈ కొత్త క్లినిక్ ద్వారా విశాఖపట్నం, ఉత్తరాంధ్ర ప్రాంత కుటుంబాలు స్థానికంగానే నిపుణులచే పరీక్షలు చేయించుకుని, అవసరమైన అత్యాధునిక చికిత్సను ఆలస్యం లేకుండా పొందగలుగుతారు’ అని చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ కె విక్రమ్ మాట్లాడుతూ ప్రతి చిన్నారికీ సరైన సమయానికి, అత్యాధునిక హార్ట్ కేర్ అందే హక్కు ఉంది. అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తూ, క్లినికల్ గా నిరూపితమైన సురక్షిత చికిత్సను అందించడం ద్వారా, ఆంధ్రప్రదేశ్లోని ప్రతి చిన్నారీ, ప్రపంచ స్థాయి గుండె వైద్య సేవలను తమకు దగ్గరలోనే పొందేలా చేయడమే మా లక్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మణిపాల్ హాస్పిటల్ విజయవాడలో విజయవంతంగా గుండె చికిత్స పొందిన ఇద్దరు చిన్నారులు, వారి కుటుంబ సభ్యులు కూడా పాల్గొని, తమ అనుభవాలను పంచుకున్నారు. కోలుకున్న వారి ప్రయాణం గురించి, గుండె సమస్యలను ముందుగానే గుర్తించి, సరైన సమయంలో చికిత్స అందించి, ప్రత్యేక వైద్య బృంద సమన్వయంతో ఎలా చిన్నారుల జీవితాలను ఆరోగ్యకరంగా మార్చిందో తెలియజేసారు. మణిపాల్ హాస్పిటల్ విజయవాడ హాస్పిటల్ డైరెక్టర్ సీఏ జె. రామాంజనేయ రెడ్డి మాట్లాడుతూ, “ఆంధ్రప్రదేశ్ అంతటా ప్రత్యేక చిన్నారుల గుండె వైద్య సేవలను విస్తరించే దిశగా ఈ క్లినిక్ మరో ముఖ్యమైన అడుగు. క్లినికల్ నైపుణ్యం, అత్యాధునిక సాంకేతికత, ఆప్యాయతతో కూడిన వైద్య సేవలతో ప్రతి చిన్నారికి ఉత్తమ చికిత్స అందించాలనే మా నిబద్ధత కొనసాగుతుంది” అని అన్నారు. అధునాతన మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన చికిత్సా విధానాలు మరియు అనుభవజ్ఞులైన బహుళ-విభాగాల బృందంతో, మణిపాల్ హాస్పిటల్ విజయవాడ ఆంధ్రప్రదేశ్ అంతటా ప్రత్యేకమైన పిల్లల గుండె జబ్బుల సేవలకు అందుబాటును విస్తరిస్తూనే ఉంది. ఒంగోలు క్లినిక్ ప్రారంభం, పిల్లల గుండె జబ్బులకు వారి సమాజానికి దగ్గరగా సకాలంలో రోగ నిర్ధారణ, అధునాతన చికిత్స, కరుణామయమైన సంరక్షణ అందేలా చూడాలనే ఆసుపత్రి యొక్క నిరంతర నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.

నవోదయ విద్యాలయంలో ముగిసిన రీజినల్ స్థాయి బాక్సింగ్ పోటీలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 24):

పియం శ్రీ నవోదయ విద్యాలయంలో రీజినల్ స్థాయి బాక్సింగ్ పోటీలు 22వ తేదీ నుండి 27 వ తేదీ వరకు 3 రోజుల పాటు నిర్వహించారు. నేటి ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ డాక్టర్ డి వివిఆర్ మూర్తి పాల్గొని ఫైనల్ పోటీలను తిలకించి విద్యార్థులను ఉత్సాహ పరిచారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు, పతకాలను అందజేశారు. పోటీలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, అండమాన్ నికోబార్, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి నవోదయ విద్యాలయాల్లో చదువుతున్న మొత్తం 128 మంది బాల, బాలికలు పాల్గొనగా వారిలో 55 మంది జాతీయ స్థాయిలో పాల్గొనడానికి అర్హత సాధించారని, ఈ జాతీయ స్థాయి పోటీలు గుజరాత్లో వడ్ నగర్ నందు నవోదయ పాఠశాలలో ఆగష్టు 18 నుండి 21 తేదీలలో జరుగుతాయని నవోదయ విద్యాలయ ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ ఆకెళ్ళ రఘు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ప్రొఫెసర్ డాక్టర్ డివిఆర్ మూర్తి మాట్లాడుతూ క్రీడల వల్ల విద్యార్థులలో ఒత్తిడిని అధిగమించవచ్చని, స్పోర్ట్స్ కోటాలో పైచదువులకు, ఉద్యోగావకాశాలకు ఎంతో ప్రాధాన్యం ఉంటుందని తెలియజేశారు. జయాపజయాలు విద్యార్థుల్లో పట్టుదల పెంచుతాయని, తద్వారా ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని తెలిపారు. విజేతలను అభినందించారు. అలాగే విద్యాలయ ఇంచార్జి ప్రిన్సిపాల్ ఆకెళ్ళ.రఘు మాట్లాడుతూ విద్యార్థులు హాయిగా ఆడుతూ పాడుతూ విద్యను కొనసాగించాలని, క్రీడలు గెలుపు ఓటములను తట్టుకునే సామర్థ్యాన్ని, మానసిక సమతౌల్యాన్ని ప్రసాదిస్తాయని, శారీరక పటుత్వం పెరుగుతుందని, పోటీ తత్వాన్ని పెంపొందిస్తాయని






తెలియజేసారు. ఈ పోటీలను నిర్వహించడంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన విద్యాలయ సిబ్బంది అందరికి ఇంచార్జి ప్రిన్సిపాల్ ఆకెళ్ళ రఘు కృతజ్ఞతలు తెలియజేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఆర్ కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యాలయ సీనియర్ టీచర్ తాతయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు ఆర్ కిషోర్ కుమార్, బాక్సింగ్ కోచ్ వేణు, విద్యాలయ సిబ్బంది అందరు, వివిధ విద్యాలయాల ఎస్జీటీ టీచరులు, కార్యాలయ సిబ్బంది, క్రీడాకారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పొన్నలూరు మండలంలో మెగా పిటీఎం

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జులై 24)

మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో, జూనియర్ కళాశాలలో మెగా పిటిఎం 4.0 శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ రాజేంద్రబాబు ఆధ్వర్యంలో పేటీఎం నిర్వహించారు ఈ







కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలు విద్యాపరంగా ప్రవర్తన పరంగా ఏ స్థాయిలో ఉన్నారో, సమాజ అంశాల పట్ల ఎలాంటి అవగాహన కలిగి ఉన్నారో తెలుసుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడంతోపాటు సమగ్ర అభివృద్ధి సాధించాలని లక్ష్యంతో తల్లిదండ్రులు ఉపాధ్యాయుల మధ్య భాగస్వామ్యాన్ని మరింత బలోపితం చేయటమే ఈ కార్యక్రమం ఉద్దేశం అని తెలిపారు. అనంతరం గత సంవత్సరం కళాశాలలో అధిక మార్కులు పొందిన విద్యార్థులకు నగదు ప్రధానం చేసి వారి తల్లిదండ్రులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొండపి ఏఎంసీ చైర్మన్ కర్ణ తిరుపతమ్మ, మండల టిడిపి నాయకులు కర్ణ కోటిరెడ్డి, మండవ ప్రసాద్, పల్లపోతు రమేష్ బాబు, మండవ మురళీమోహన్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లికి వందనం, మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ 4.0లో పాల్గొన్న గూడూరి ఎరిక్షన్ బాబు



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, జులై 24)

యర్రగొండపాలెం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉర్దూ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన తల్లికి వందనం, మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ 4.0 కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న లీప్ యాప్ ద్వారా విద్యార్థుల లాగిన్ విధానం, అభ్యాస పురోగతి, డిజిటల్ లెర్నింగ్ విధానాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి డిజిటల్ స్క్రీన్పై నిర్వహిస్తున్న తరగతులను వీక్షించి, విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించారు. తదుపరి నిర్వహించిన సభలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్య, సంక్షేమం, అభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక సాంకేతికతతో తీర్చిదిద్దుతూ, నాణ్యమైన విద్యను ప్రతి విద్యార్థికి అందించే దిశగా విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నారని కొనియాడారు. విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం, ఉన్నతమైన యూనిఫాంలు, డిజిటల్ విద్య, లీప్ యాప్, మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్స్, తల్లికి వందనం వంటి ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తోందని పేర్కొన్నారు. అలాగే తల్లికి వందనం పథకం ద్వారా యర్రగొండపాలెం నియోజకవర్గంలోని 40,600 మంది విద్యార్థులకు రూ. 52.78 కోట్లను వారి తల్లుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయడం రాష్ట్ర ప్రభుత్వ విద్యాపట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. చివరగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి తల్లిదండ్రులందరూ పాలాభిషేకం చేశారు.





కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయకపోతే ఢిల్లీని ముట్టడిస్తాం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 24)

దేశవ్యాప్తంగా 155 ప్రశ్నపత్రాల లీకేజీ కారకులైన, ఏడు కోట్ల మంది విద్యార్థుల జీవితాలు ధ్వంసం అయ్యాయని, దాదాపు 20 మంది విద్యార్థుల ఆత్మహత్యలకు కారకుడైన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయకపోతే ఢిల్లీ నీ ముట్టడిస్తామని విద్యార్థి సంఘాల నేతలు వెల్లడించారు. నీట్ పేపర్ లీకేజీకి కారుకులైన ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కోరుతూ 20వ తేదీ ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు శాంతియుత ఆందోళన చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం తన పోలీసు బలగాల చేత, ఆందోళన చేస్తున్న విద్యార్థులపై అత్యంత కిరాతకంగా, అప్రజా స్వామీకంగా విద్యార్థులపై టీఆర్ గ్యాస్, భాష్ప వాయువు వంటి వాటిని ఉపయోగిస్తూ దారుణంగా లాఠిచార్జి చేయటానికి నిరసిస్తూ ఈరోజు దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ విద్యార్థి సంఘాల పిలుపునిచ్చాయి... ఈ క్రమంలో రెండు రోజులు ముందు నుంచే విద్యార్థి సంఘాల నేతలు ప్రైవేట్ విద్యాసంస్థల వారికి నోటీసులు అందించారు.. 90% ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు బందుకు అంగీకరించాయి.. ఈరోజు ఒంగోలు నగరంలో విద్యార్థి సంఘాల నేతలు ముందుగా దామచర్ల సక్కుబాయమ్మ పాలిటెక్నిక్ కళాశాల, డిగ్రీ కళాశాల, ఏబీఎం జూనియర్ కళాశాల, ఆంధ్ర కేసరి యూనివర్సిటీ, మిగిలిన ప్రభుత్వ విద్యా సంస్థలను దగ్గరుండి మూయించే ప్రయత్నం చేశారు.. ప్రభుత్వం ఇచ్చిన నిబంధన వల్ల పోలీసుల అత్యుత్సాహం వల్ల బందును జరగకుండా చేయాలని చూసినప్పటికీ జిల్లా వ్యాప్తంగా బంద్ విజయవంతం అయింది.. అనంతరం విద్యార్థి యువజన సంఘాల నేతలు మాట్లాడుతూ



కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గారు రాజీనామా చేయాలని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జి చేయటం దుర్మార్గమన్నారు... కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానం వలన మొత్తం విద్యా వ్యవస్థ నాశనం అయి పోయిందన్నారు. సంవత్సరానికి కోటి ఉద్యోగాలు ఇస్తానన్న మోడీ, నేడు మాట తప్పారన్నారు.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని అడ్డు పెట్టుకొని, పార్లమెంట్లో తన బలాన్ని అడ్డుపెట్టుకొని కీలకమైన బిల్లుల్ని ఆమోదించుకుంటున్నారు తప్ప, విద్యార్థులు,యువజనులు గురించి ఆలోచించే పరిస్థితి లేదన్నారు. ప్రముఖ పర్యావరణ వేత్త సోనం వాంగ్ చుక్ విద్యార్థులకు మద్దతుగా 23 రోజుల నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేస్తుంటే కనీసం ఆయన తోటి చర్చలు జరిపేది కూడా భారత ప్రభుత్వానికి తీరిక లేదని ఆందోళన చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆలోచన చేసి నీట్ ప్రవేశ పరీక్షను రాష్ట్రాల పరిధిలోకి తీసుకొని రావాలని, జాతీయ సాయి ప్రశ్న పత్రాల లీకేజీలపై పార్లమెంట్లో చర్చ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ రద్దుచేసి, ప్రభుత్వమే పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేదంటే రాబోయే రోజుల్లో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని ఎప్పటికీ హెచ్చరిస్తారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడియస్యూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్ రాజశేఖర్, ఏపీ విద్యార్థి యువజన జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు రాయపాటి జగదీష్, భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరాస్వామి, అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా అధ్యక్షులు కరుణానిధి, జిల్లా కార్యదర్శి బాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు ఆర్ మరియబాబు, రాకేష్, కిరణ్, నితీష్ కుమార్ ఐద్వా జిల్లా కార్యదర్శి కండల రమాదేవి, జిల్లా నాయకులు రాజ్యలక్ష్మి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి రఘురామ్, జిల్లా కార్యదర్శి ఎం రమేష్, శ్రీకాంత్, అభిమన్యు, చారి, సంపత్లు, నాయకులు సోమేశ్, అవినాష్, సచిన్, విద్యార్థి యువజన జేఏసీ నాయకులు రాజీవ్, ఈస్టర్, పాల్గొన్నారు.







బాపట్లలో ఉచిత హోమియో వైద్య శిబిరం



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జులై 24)

శుక్రవారం ఉదయం బాపట్ల జిల్లాలోని రెడ్ క్రాస్ సొసైటీ భవనంనందు ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ వారి సౌజన్యంతో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ శిబిరానికి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అనంతరం ఉచిత ప్రభుత్వ హోమియో మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం రెడ్ క్రాస్ సొసైటీ భవనం నందు నిర్వహించబడుతున్న ఈ ఉచిత హోమియో వైద్య శిబిరం నందు షుగర్, బిపి, థైరాయిడ్, ఊబకాయం వంటి జీవనశైలి వ్యాధులకు, మైగ్రేన్, చెవి ముక్కు గొంతు సమస్యలు, గుండె మరియు శ్వాసకోస వ్యాధులు, చర్మ వ్యాధులు, ఎలర్జీలు, జీర్ణకోశ వ్యాధులు, మెదడు, నరాల సంబంధిత వ్యాధులు, అన్ని రకాల కీళ్ల సమస్యలు, స్త్రీలలో వచ్చే అన్నిరకాల నెలసరి మరియు గర్భధారణ సమస్యలు, పురుషుల్లో వచ్చే అంగస్తంభన, శుక్రకణాల సంఖ్య తగ్గడం మరియు ఎక్కడా తగ్గని మొండి వ్యాధులకు అత్యుత్తమైన ప్రభుత్వ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, కావున బాపట్ల పట్టణ మరియు పరిసర ప్రాంత ప్రజలు ఈ ఉచిత హోమియో వైద్య శిబిర సేవలను వినియోగించుకొని, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాపట్ల రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ నారాయణ బట్టు, రెడ్ క్రాస్ బృందం, తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణపురం ప్రభుత్వ పాఠశాలకు ప్రత్యేక నోటు పుస్తకాల బహూకరణ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 24)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ 4.0 కార్యక్రమాన్ని శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఒంగోలులోని సత్యనారాయణపురం మండల పరిషత్ ప్రాథమిక మోడల్ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్య బృందం పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ చాపల వంశీకృష్ణ, హైరిస్క్ ప్రెగ్నెన్సీ స్పెషలిస్ట్, సంతాన సాఫల్య నిపుణులు, ల్యాపరోస్కోపీ సర్జన్ డాక్టర్ చాపల శాంతకుమారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ చాపల వంశీకృష్ణ మాట్లాడుతూ పిల్లల విద్యతో పాటు వారి ఆరోగ్యం కూడా సమానంగా ముఖ్యమని, తల్లిదండ్రులు పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆరోగ్యవంతమైన పిల్లలే రేపటి సమాజానికి బలమైన పునాది అని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు శ్రీరామ్ హాస్పిటల్ తన సేవలను కొనసాగిస్తుందని తెలియచేసారు. అనంతరం విద్యార్థులందరికీ ఈ విద్యాసంవత్సరానికి సరిపడ అన్ని రకాల ప్రత్యేకంగా ముద్రించిన నోట్ పుస్తకాలను, ఫ్రీ హెల్త్ స్క్రీనింగ్ కార్డును విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ సరోజిని దేవి , పురిటి బిడ్డలు, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ గంగా సాగర్‌రెడ్డి, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కొప్పోలు సౌమిత్ర పల్లవ్, మాజీ కార్పొరేటర్ అంగిరేకుల గురవయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రేణుక అనే తల్లి చెప్పిన మాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. తన ఇద్దరి కుమార్తెలను ఐఏఎస్‌లుగా చూడాలన్నదే తన జీవిత లక్ష్యం, వాళ్ళ కలను నిజం చేయడానికి తల్లిగా ఎంత కష్టమైనా పడతాను, వాళ్ళ చదువుకు ఎల్లప్పుడూ అండగా ఉంటాను అని ఆమె భావోద్వేగంగా చెప్పడంతో సభలో ఉన్నవారంతా చప్పట్లతో అభినందించారు. రేణుక చూపించిన తల్లి సంకల్పాన్ని అభినందిస్తూ, శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ హైరిస్క్ ప్రెగ్నెన్సీ స్పెషలిస్ట్, సంతాన సాఫల్య నిపుణులు, ల్యాపరోస్కోపీ సర్జన్ డాక్టర్ శాంతకుమారి ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించి, కుమార్తెలను వాళ్ళ లక్ష్యాన్ని సాధించాలని ఆశీర్వదించారు.





మైదుకూరు వాసవి అమ్మవారికి 'ముత్యాల చీర' సమర్పణ







(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జులై 24)

మైదుకూరు పట్టణంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి మైదుకూరు ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో సుమారు 2 లక్షల విలువైన ముత్యాల చీరను ఘనంగా సమర్పించారు. ఉదయం 7 గంటలకు కడప రోడ్డులోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం నుండి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ముత్యాల చీరను ఊరేగింపుగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయానికి అమ్మవారిశాలకు తీసుకువెళ్లారు. ముత్యాల చీరను ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బల్లాన్ని చెన్నకేశవ ప్రసాద్ ,వారి కమిటీ సభ్యులకు మహిళా మండలి అధ్యక్షురాలు బల్లాని సునంద వారి కమిటీ సభ్యులు అందజేశారు. అనంతరం ఆలయంలో 108 మంది మహిళలతో వడిబియ్యం సమర్పణ మరియు విశేష కుంకుమార్చన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో బల్లాన్ని చెన్నకేశవ ప్రసాద్, అధ్యక్షులు దొంతు వెంకటసుబ్బయ్య, పేరురు నాగరాజు, ఉపాధ్యక్షులు కోట అశోక్ కుమార్, సెక్రటరీ దరిశా శ్రీనివాసులు, కోశాధికారి యెలిశెట్టి గురు ప్రసాద్, జిల్లా వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ పుట్టా శివ, జాయింట్ సెక్రటరీ నూకల సత్యనారాయణ, మండల సంఘం అధ్యక్షులు వంకదార శ్రీనివాసులు, కోటా సంజీవరాయ గుప్తా, ఇమ్మిడిశెట్టి సతీష్, మలిపేద్దు హరినాథ్, కుప్పం కిషోర్, ఆర్యవైశ్య యువజన సంఘం పుట్టా సాయి, అధ్యక్షులు తులసి సత్యసాయి, భూపాలం ఉపేంద్ర, జొన్నలగడ్డ మనోజ్, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు బల్లాని సునంద, బచ్చు శ్రీదేవి, వంకదార వాసంతి, మండల అధ్యక్షురాలు, ఇతర మహిళా మండలి, ఆర్యవైశ్య సభ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కడప జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు రాజా వెంకట వరలక్ష్మి

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జులై 24)

దువ్వూరులో జరిగిన మహిళా మండలి సమావేశంనకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దువ్వూరు మహిళా మండలి వారు వీరికి ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ విశేషాలను గురించి చిలంకూరు వీర వెంకటస్వామి జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు మరియు వారి కమిటీ సభ్యులకు తెలియజేయడం జరిగింది. అనంతరం అమ్మవారి ఆలయంలో దర్శనం, పూజ ఏర్పాటు చేసి రాజా వెంకట వరలక్ష్మిని, వారి కమిటీ సభ్యులను





ఘనంగా సన్మానం చేయడం జరిగింది. అనంతరం జరిగిన జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘం ఎగ్జిక్యూటివ్ కమిటీ నియామకాల్లో దువ్వూరు మండలం నుండి జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘం ఉపాధ్యక్షురాలుగా చిలంకూరు పుష్పలత, జాయింట్ సెక్రటరీగా లింగం ఉషారాణిని, ఈసీ మెంబర్‌గా జూటూరు అంజన దేవిని నియమించారు. దువ్వూరు మండల ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలిగా ఈపూరి భారతి కి నియామక పత్రం అందించడం జరిగింది. మండల మహిళా సంఘానికి సెక్రటరీగా ఆరవేటి సుజాత, కోశాధికారిగా చిలంకూరు సుధామణిని నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం కమిటీ సభ్యులు మహిళా మండలి సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతనంగా ఎన్నికైన బాధ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

వెలుగు
ePaper
www.shanmukhavelugu.com

విద్యారంగ అభివృద్ధికి తమ ప్రభుత్వం విశేష కృషి

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

(షణ్ముఖ వెలుగు, జె పంగులూరు, జులై 24)

విద్యారంగ అభివృద్ధికి తమ ప్రభుత్వం విశేష కృషి చేస్తున్నట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. ఈ దిశగా అమలు చేస్తున్న పథకాలు, తీసుకుంటున్న నిర్ణయాలే దీనికి నిదర్శనం అన్నారు. శుక్రవారం జె.పంగులూరు మండలం రేణింగవరం గ్రామంలో నిర్వహించిన 'మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్-4.0' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి రాజాబాబుతో కలిసి ఆయన పాల్గొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతోనూ, వారి తల్లిదండ్రులతోనూ ఈ సందర్భంగా మంత్రి, కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడారు. విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందుతున్న తీరుపై తల్లిదండ్రులతో ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో విద్యారంగ అభివృద్ధికి తమ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ' తల్లికి వందనం ' పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా రూ. 8500 కోట్లకు పైగా విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాలలో జమ చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన మూడు జతల యూనిఫారాలు, బూట్లు, బెల్టు, బ్యాగు, డిక్షనరీ, పుస్తకాలను అందిస్తున్నట్లు తెలిపారు. వారి ఆరోగ్య భద్రత కోసం పోషకాహారం అందేలా నాణ్యమైన భోజనం పెడుతున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు కూడా పాఠశాలలను సందర్శించి భోజనం నాణ్యతను పరిశీలించాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు. అర్హత ఉన్నప్పటికీ సాంకేతిక కారణాల వలన ' తల్లికి వందనం ' డబ్బులు జమకాని వారికి కూడా త్వరలోనే వచ్చేలా చూడాలని అధికారులకు చెప్పారు. తమ పాఠశాలకు హెచ్ఎం, పీఈటీ పోస్టులను మంజూరు చేయాలని, అదనపు తరగతి గదులు కావాలని స్థానికులు కోరగా, తక్షణమే ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన బోధన కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 16,000 టీచర్ పోస్టులను భర్తీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నియామకాలలో పారదర్శకత పాటించామన్నారు. త్వరలో భర్తీకానున్న విద్యుత్ శాఖ ఏఈఈ పోస్టులను కూడా పారదర్శకంగా భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఎవరైనా ప్రచారం చేస్తే



నమ్మవద్దని ఆయన సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యారంగంలో ప్రభుత్వం తీసుకుంటున్న వినూత్న నిర్ణయాలతో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయన్నారు. మధ్యాహ్న భోజన నాణ్యతతో పాటు వివిధ అంశాలపై లీప్ యాప్ ద్వారా తల్లిదండ్రులు తమ అభిప్రాయాలను తెలియజేసేందుకు అవకాశం ఉందన్నారు. నేరుగా ఉపాధ్యాయులతో మాట్లాడి తమ బిడ్డల విద్యా ప్రగతిపై చర్చించేందుకు ప్రభుత్వం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యారంగ అభివృద్ధిలోనూ, విద్యార్థుల సమగ్ర ఎదుగుదలలోనూ తల్లిదండ్రులను కూడా ప్రభుత్వం భాగస్వాములను చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలోని మౌలిక వసతులను కూడా కలెక్టర్ పరిశీలించారు. లీప్ యాప్ ద్వారా అందుతున్న సేవలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కాగా, ప్రభుత్వ సహకారం, తల్లిదండ్రుల మద్దతు, ఉపాధ్యాయుల దిశా నిర్దేశంతో మండలంలో తాము టాపర్స్‌గా నిలిచామని ఇటీవల ' షైనింగ్ స్టార్స్ ' అవార్డు పొందిన విద్యార్థులు ఈ కార్యక్రమంలో తమ అనుభవాలను పంచుకున్నారు. మధ్యాహ్న భోజనం రుచి, ' డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర ' కిట్లలోని వస్తువుల నాణ్యత పై తల్లిదండ్రులు కూడా ఈ కార్యక్రమంలో సంతృప్తి వ్యక్తం చేశారు. తమకు ఐదుగురు బిడ్డలని, గత ఏడాది తల్లికి వందనం డబ్బులు రాకపోతే అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, ఈసారి తమ బిడ్డలందరికీ డబ్బులు వచ్చాయని అద్దంకికి చెందిన అంజయ్య, వరలక్ష్మి దంపతులు సంతృప్తి వ్యక్తం చేశారు. డ్రగ్స్ వినియోగించబోమని, మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో తమ వంతు బాధ్యత నిర్వహిస్తామని విద్యార్థులతోనూ, తల్లిదండ్రులతోనూ కలెక్టర్, మంత్రి ఈ కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేయించారు. డీఈవో సి.వి. రేణుక మాట్లాడుతూ రేణింగవరం సచివాలయం పరిధిలో 301 మంది విద్యార్థులు ' తల్లికి వందనం ' పథకానికి అర్హులైనట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం 38 మంది అనర్హులుగా తేలారనీ, మరో 8 మంది విద్యార్థులకు టెక్నికల్ ఇబ్బందుల వల్ల రాలేదన్నారు. వీలైనంత త్వరగా వారి సమస్యలను పరిష్కరించి అర్హులైన అందరికీ ' తల్లికి వందనం ' వచ్చేలా చూస్తామన్నారు. లీప్ యాప్ డౌన్లోడ్ చేసుకోవడంలో రాష్ట్రంలో ప్రకాశం జిల్లా నాలుగో స్థానంలో ఉందన్నారు.

విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ

ఆరో తరగతి నుంచి పదవ తరగతి చదువుతున్న 88 మంది విద్యార్థులకు అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో మంత్రి, కలెక్టర్ ఈ సందర్భంగా సైకిళ్లను పంపిణీ చేశారు. విద్యార్థులకు అన్ని విధాలా ప్రభుత్వం అండగా ఉంటున్నట్లు వారు చెప్పారు. ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తగా సైకిల్ తొక్కాలని సూచించారు. లబ్ధిదారులలో రేణింగవరం, జాగర్లమూడివారిపాలెం, కస్యాపురం, వెంకటాపురం విద్యార్థులు ఉన్నారు.


తారు రోడ్డు ప్రారంభం

దీనికి ముందుగా రేణింగవరం నుంచి అలవలపాడు గ్రామంలోనికి కొత్తగా రూ. 2.30 కోట్లతో నిర్మించిన తారురోడ్డును మంత్రి ప్రారంభించారు. స్థానిక ఆలయంలో రూ. 90 లక్షలతో నిర్మించే భజన మండపానికి కూడా ఆయన శంకుస్థాపన చేశారు. వలపర్ల – రామకూరు మధ్య కూడా రోడ్డు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇంకా అవసరమైన చోట రోడ్లు వేసేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమాలలో ఆర్డిఓ విజయ జ్యోతి కుమారి, డ్వామా పి డీ జోసఫ్ కుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్, భూగర్భ నీటివనరులశాఖ డిప్యూటీ డైరెక్టర్, మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, తహసిల్దార్ సింగారావు, ఎంఈఓలు కాలేశా వలి, వీరాంజనేయులు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ వీరయ్య, ఇతర సభ్యులు, స్థానిక అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ అధికారులు భోజనాలు ఏర్పాటు చేయించారు.













పాదిలిలో మల్బరీ సాగు, బైవోల్టీన్ పెంపకంపై రైతులకు శిక్షణ





(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 24)

పొదిలి ఆర్.ఎస్.కే-2 పరిధిలో పట్టు పరిశ్రమ శాఖ, ఆత్మ సంయుక్త ఆధ్వర్యంలో మల్బరీ పంటలో ప్రకృతి వ్యవసాయం, బైవోల్టీన్ పట్టు పురుగుల పెంపకంపై రైతులకు అవగాహన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతపురం పట్టు పరిశ్రమ శాస్త్రవేత్త డాక్టర్ రమ్య మాట్లాడుతూ మల్బరీలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, వేరు కుళ్ళు వ్యాధి నివారణకు సాఫ్ , ప్రూఫ్ వాడకంపై అవగాహన కల్పించారు. సహాయ పట్టు పరిశ్రమ అధికారి వి పాండురంగ స్వామిరెడ్డి మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం నుంచి పంటలను కాపాడుకునే చర్యలు, పట్టు సాగులోని లాభాలను వివరించారు. మండల వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు నానో యూరియా వాడకాన్ని ప్రోత్సహించగా, ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి వై మేరీదేట్ల జీవామృతం, ఘనామృతం వాడకం గురించి తెలిపారు. ఆత్మ బిటియం వై నాగభూషణం రాబోయే ప్రదర్శన క్షేత్రాల వివరాలను వెల్లడించారు. శిక్షణ ముగింపులో రైతులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖాధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి ఎస్ఎఫ్ఐ డిమాండ్



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 24)

కందుకూరు పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్య సంస్థల బంధు జరిగింది. ఉదయం ఎస్ఎఫ్ఐ ర్యాలీగా అన్ని విద్యాసంస్థలలో ప్రచారం చేసుకుంటూ ముగింపు అంబేద్కర్ బొమ్మ వద్ద మానవహారం సభ జరిగింది. ఈ సందర్భంగా కందుకూరు పట్టణ ఎస్ఎఫ్ఐ కార్యదర్శి జి లలితేష్ మాట్లాడుతూ పేపర్ లీకేజ్ కు బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, పూర్తిస్థాయి విచారణ జరపాలని, భవిష్యత్తులో విద్యార్థులకు ఇలాంటి సమస్యలు రాకుండా చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ జంతర్మంతర్ వద్ద నిరసన తెలియజేస్తున్న విద్యార్థుల మీద లాటి చార్జి చేయటం దారుణమని, లాఠీ చార్జి చేసిన వారి మీద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఎఫ్ఐ నాయకులు ఎస్డి హిర్దోస్, ఈ ఆఫీస్ షేక్ మున్సూర్, టీ చరణ్, ఎస్కె హుస్సేన్ బి, నాగచైతన్య, కార్మిక సంఘాల నాయకులు ఎస్ఏ గౌస్, బి సురేష్, మహిళా సంఘం మున్వర్ సుల్తానా ఎం పద్మ, సామాజిక కార్యకర్తలు పి కోటేశ్వరరావు, బీవీ వార్డెన్ జి చిరంజీవి పాల్గొన్నారు.

కేంద్ర విద్యశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయ్యాలి

(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జులై 24)

కేంద్ర విద్య శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయ్యలని మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు జీ ప్రతాప్ కుమార్ కేంద్ర ప్రభుత్వన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ సందర్భంగా చిన్నగంజాం నందు ఎస్ఎఫ్ఐ అధ్వర్యంలో పలు పాఠశాలల వద్ద నిరసన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ నీట్ పరిక్ష పత్రాల లీకు బాధితలను కఠినంగా శిక్షించాలన్నారు. డిల్లీ ర్యాలీలో జరిగిన లాఠీ చార్జీను ఖండించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కె తేజ, జీ రమేష్, సురేష్, బ్లెస్సి, దినకర్, చరణ్, వెంకట్, శ్రీను, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

రూ.2.30 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డు ప్రజలకు అంకితం

నాణ్యమైన రహదారులతోనే ప్రమాదాలు నివారణ

వైసీపీ హయాంలో రహదారుల వ్యవస్థ ధ్వంసం

ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి

(షణ్ముఖ వెలుగు, అద్దంకి, జులై 24)

నియోజకవర్గంలోనే సుమారు రూ. 100 కోట్లకు పైగా విలువైన తారు రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు. ఇందులో కొన్ని రోడ్లు ఇప్పటికే పూర్తయ్యాయని, మిగిలిన నిర్మాణాలు కూడా త్వరలోనే పూర్తవుతాయని మంత్రి ప్రకటించారు. జే పంగలూరు మండలంలో శుక్రవారం మంత్రి గొట్టిపాటి పర్యటించారు. ఈ సందర్భంగా జే.పంగలూరు మండలంలో రేణింగవరం, అలవలపాడు మధ్య రూ. 2.30 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డును మంత్రి గొట్టిపాటి ప్రజలకు అంకితం చేశారు. అనంతరం రేణింగవరంలోనే రూ. 90 లక్షలతో నిర్మాణం చేపట్టనున్న పురాణ కాలక్షేప మండపానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ., గత వైసీపీ ప్రభుత్వం రహదారుల వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేసిందని విమర్శించారు. రోడ్ల నిర్మాణం, వాటి మరమత్తులను నిర్లక్ష్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం కోట్లాది రూపాయిలతో నూతన రహదారులను నిర్మించడంతో పాటు రోడ్లకు మరమత్తులు చేస్తూ గ్రామాల మధ్య అనుసంధానాన్ని మరింత అభివృద్ధి చేస్తుందని వివరించారు. నాణ్యమైన రహదారులతోనే ప్రమాదాలను నివారించవచ్చని మంత్రి



పేర్కొన్నారు. అదే విధంగా అద్దంకి నియోజవర్గంలో సుమారు 40 హెల్త్ సెంటర్ల నిర్మాణాన్ని చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. ఇందులో కొన్ని ఇప్పటికే ప్రజలకు అందుబాటులోకి వచ్చాయన్నారు. అదే విధంగా దాతల సహాయంతో కమ్యూనిటీ సెంటర్లను నిర్మిస్తున్నామని తెలిపారు. రైతులకు కూడా అన్నదాత సుఖీభవ అందిస్తున్నామన్నారు. మహిళలు, వికలాంగులతో పాటు అన్ని వర్గాలకూ కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాల ద్వారా న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా కలెక్టర్ పి.రాజబాబు, పలువురు అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.





ప్రైవేట్ స్కూల్స్‌కు ధీటుగా ప్రభుత్వ బడులు.. లోకేష్ మార్క్ విద్యా సంస్కరణలు

ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దే దిశగా మంత్రి లోకేష్ ప్రత్యేక దృష్టి -ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 24)

ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి సారించారని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ తీసుకుంటున్న నిర్ణయాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెరిగి అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నాయని తెలిపారు. ఒంగోలులోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్-టీచర్స్ మీట్‌లో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.38 వేల కోట్లు కేటాయించిన ఘనత మంత్రి నారా లోకేష్‌కు దక్కుతుందన్నారు. పేద పిల్లలు చదువుకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటే వారందరికీ తల్లికి వందనం అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిదని తెలిపారు. విద్యతోనే పిల్లల భవిష్యత్‌కు బలమైన పునాది పడుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లల చదువు పై నిరంతరం దృష్టి సారిస్తూ వారిని ప్రోత్సహించాలని సూచించారు. ఒంగోలులోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిందని ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ ప్రాంగణంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పీడీసీసీ బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి డాక్టర్ కామేపల్లి సీతారామయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చదువుతో పాటు వారికి అందించే మధ్యాహ్న భోజనంపై కూడా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. పిల్లలు బాగా చదువుకోవాలని, తల్లిదండ్రులు వారి చదువును గమనిస్తూ ప్రోత్సహించాలని సూచించారు. ఉడా చైర్మన్ షేక్ రియాజ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యా రంగ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు డీజేఆర్ ట్రస్ట్ ద్వారా వందలాది మంది విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు మాట్లాడుతూ గతంలో అమ్మ ఒడి పథకం కింద కుటుంబంలో ఒక్కరికే నగదు అందించేవారని, కూటమి ప్రభుత్వం మాత్రం ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటే వారందరికీ తల్లికి వందనం అందిస్తోందని తెలిపారు. పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు గుర్తించి ప్రోత్సహించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. సందర్భంగా ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో టాప్ ఫైవ్‌లో నిలిచిన విద్యార్థినులను, వారి తల్లిదండ్రులను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు ఘనంగా సత్కరించారు. ఖాసింభీ అనే విద్యార్థిని తల్లికి వందనం పథకం ద్వారా తమలాంటి పేద విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని వివరించారు. విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో సూపర్ బజార్ చైర్మన్ పల్లపోతు వెంకటేశ్వర్లు, ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ వెంకట కృష్ణయ్య, ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పప్పు శీను, మాజీ డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, టీడీపీ నాయకులు టీవీ శ్రీరామమూర్తి, తాతా ప్రసాద్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ జగదీష్, ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.



మీ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చండి అనుభవజ్ఞులైన టీచర్లు, సకల సౌకర్యాలు సిద్ధం

తల్లిదండ్రులకు ఎమ్మెల్యే ఇంటూరి పిలుపు తల్లికి వందనం ద్వారా నియోజకవర్గంలో రూ.46 కోట్లు విడుదల





(షణ్ముఖ వెలుగు, గుడ్లూరు, జులై 24)

కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి నిర్వహించిన మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ 4.0 గుడ్లూరు మండలం అదవిరాజుపాలెం హైస్కూల్‌లో శుక్రవారం జరిగింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు, నేతల సందడితో కోలాహలంగా సాగింది. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జగన్ లాగా మేము మాట తప్పలేదు. ప్రతి ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే, అంతమందికి తల్లికి వందనం ద్వారా 15వేలు ఇచ్చాం. నియోజకవర్గంలో 31,330 మంది పాఠశాల విద్యార్థులకు రూ.40.72 కోట్ల రూపాయలు, 4,149 మంది కాలేజీ విద్యార్థులకు రూ. 5.39 కోట్ల రూపాయలు మొత్తంగా 35,479 మంది విద్యార్థులకు రూ.46 కోట్లు ఖాతాల్లో జమ అయ్యాయి. తల్లిదండ్రులు సంతోషంగా ఉన్నారు. నారా లోకేష్ గారి కృషితో ప్రభుత్వ పాఠశాల్లో మార్పులు వచ్చాయి. డీఎస్సీ ద్వారా ప్రతిభ కలిగిన టీచర్లు వచ్చారు. వసతులన్నీ చక్కగా ఏర్పాటయ్యాయి. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి. ముఖ్యంగా ప్రతి ఆడబిడ్డను విద్యాధికురాలిని చేయాలి అని ఎమ్మెల్యే నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గత ప్రభుత్వంలో జీతాలు ఎప్పుడు ఇస్తారో తెలిసేది కాదు. ఇప్పుడు ఒకటవ తేదీనే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్న పరిస్థితి ఉంది. కేవలం బటన్ నొక్కిన ప్రభుత్వానికి, హామీలను నిలబెట్టుకుంటున్న ప్రభుత్వానికి తేడా గుర్తించండి. మంచి ప్రభుత్వానికి మద్దతు ఇవ్వండి అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పిల్లల్లో విద్యా ప్రమాణాలు, పాఠశాలల్లో సౌకర్యాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా కార్యక్రమాల గురించి తెలుసుకోవడానికి మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ కార్యక్రమం ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. గ్రామస్తుల కోరిక మేరకు వచ్చే ఏడాది నాటికి హైస్కూల్ కు గ్రౌండ్ మరియు 6 తరగతి గదులు ఏర్పాటు చేస్తాను. గ్రామ సమీపంలో ఎలికేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణంతోపాటు కావలికి తారురోడ్డు సౌకర్యం కల్పిస్తాను. గ్రామంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే



విద్యార్థులతో కలిసి నేల పై కూర్చొని, భోజనం చేశారు. స్కూలు ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థుల గురించి తల్లిదండ్రులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఏడాది నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా బాధ్యత తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఓ రవి, ఎంఈఓలు గోవర్ధన్, హరిరామ్, ఎంపీడీవో మల్లికార్జునరావు, మండల టిడిపి అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, జనసేన మండల అధ్యక్షుడు గిరిబాబు, గ్రామ టిడిపి అధ్యక్షుడు గుండ్లపల్లి సుబ్బారావు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ గుండ్లపల్లి శివాజీ, గ్రామ నాయకులు బొజ్జా వేణు, మద్దసాని కృష్ణ, గుండ్లపల్లి వెంకట శివాజీ, బ్రహ్మయ్య, అక్కిలగుంట ఒరయ్య, ప్రకాశం, ఆశీర్వాదం, క్లస్టర్ ఇన్చార్జులు చిత్తూరు మల్లికార్జున, ఉమ్మనేని సుబ్బారావు, మండలంలోని అన్ని గ్రామాల టిడిపి అధ్యక్షులు, అనుబంధ కమిటీల సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెగా పీటీఎం-4.0 విజయవంతం అర్బన్ హెల్త్ సెంటర్‌లో ముఖ్య అతిథిగా వార్డ్ మెంబర్ సద్దాం హుస్సేన్



(షణ్ముఖ వెలుగు, కంభం, జులై 24)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ 4.0 కార్యక్రమం సందర్భంగా కంభంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అర్బన్ కాలనీ వార్డ్ మెంబర్ షేక్ సద్దాం హుస్సేన్ హాజరై విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల విద్యా పురోగతి, తల్లిదండ్రుల భాగస్వామ్యం, నాణ్యమైన విద్య అందించడంలో ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై చర్చించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రతిభను వివరించగా, తల్లిదండ్రులు పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, ఆరోగ్యశాఖ సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథికి పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు.

ఢిల్లీలో విద్యార్థుల పై జరిగిన లాఠీచార్జి నిరసిస్తూ

రాష్ట్ర బంద్ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉలవపాడులో ర్యాలీ, నిరసన



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 24)

నీట్ పరీక్ష లో లీకేజీలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, అందుకు బాధ్యత వహిస్తూ జాతీయ విద్యా శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకల కారణంగా మనస్తాపం చెంది మృతి చెందిన 22 మంది విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలని, ఢిల్లీలో విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా, అమానుషంగా కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల పైన జరిపిన లాఠీచార్జి నిరసిస్తూ ఉలవపాడు లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బంద్ జయప్రదం అయింది. ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలలు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. మెగా పేరెంట్స్ ఈవెంట్ కారణంగా ప్రభుత్వ హైస్కూల్లో తల్లిదండ్రులతో మీటింగ్ జరిగింది. ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కాలేజీల్లో బంద్ చేయించారు. ఈ బంద్‌కు సిఐటియు మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కాలేజ్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిఐటియు జిల్లా నాయకులు జీవీబీ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నీట్ పెద్ద ఎత్తున అవకతవకలకు పాల్పడిందని పేర్కొన్నారు. అందుకు బాధ్యత వహించాల్సిన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఢిల్లీలో గత 22 రోజులుగా సామాజిక కార్యకర్త వాంగ్ చుక్ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న, వారికి సంఘీభావంగా లక్షల సంఖ్యలో విద్యార్థులు ఢిల్లీలో జరిపిన నిరసన తెలిపారు అని, దీంతోనైనా కేంద్రం ప్రభుత్వానికి తగిన గుణపాఠం రావాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం విచారణ జరిపి నీట్ పరీక్షలో అవకతవకలకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని, విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, పరీక్షలలో లీకేజీలు జరగకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల పోరాటం అపూర్వమని కొనియాడారు. ఈ ఎస్ఎఫ్ఐ మండల నాయకులు ఎస్ వంశీ, ఎం నవదీప్, బి శంకర్, జి అనిత, డి ఈశ్వర్, కిరణ్ జై, తదితరులు పాల్గొన్నారు.

కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో
అంగరంగ వైభవంగా మెగా పీటీఎం 4.0

పండుగ వాతావరణంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుసందడి

(షణ్ముఖ వెలుగు, కంభం, జులై 24)

మెగా పీటీఎం-4.0 కార్యక్రమాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ సత్తార్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. శుక్రవారం పాఠశాల ఆవరణను రంగురంగుల రంగవల్లులు, ఆకర్షణీయమైన తోరణాలు, స్వాగత తెరలు విద్యార్థుల చిత్రలేఖనాలు, విద్యా ప్రదర్శనలతో సుందరంగా అలంకరించారు. పాఠశాలకు విచ్చేసిన తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, పూర్వ విద్యార్థులకు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాఠశాలలో అందుబాటులో ఉన్న క్రీడా సౌకర్యాలు, ఎన్‌సీసీ విభాగం, సీడబ్ల్యూఎస్ఎన్ (ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు), ఆధునిక లైబ్రరీ, సైన్స్ ల్యాబ్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, కంప్యూటర్ ల్యాబ్, స్మార్ట్ క్లాస్‌రూమ్స్, పరిశుభ్రమైన తాగునీరు, పచ్చదనంతో కూడిన ప్రాంగణం తదితర సౌకర్యాలను తల్లిదండ్రులకు ప్రత్యక్షంగా చూపించి వాటి ఉపయోగాలను వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన అన్ని అవకాశాలు కల్పిస్తున్నామని ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, ఎన్‌సీసీ, శాస్త్రీయ, పఠన, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించి తమ ప్రతిభను వెలికితీయాలని సూచించారు. విద్యార్థుల ప్రతిభను ప్రతిబింబించే సైన్స్ నమూనాలు, కళాఖండాలు, ప్రాజెక్టులు, చేతిపనుల ప్రదర్శనలు తల్లిదండ్రులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని, పిల్లల చదువుపై నిరంతరం శ్రద్ధ వహించాలని, వారి హాజరు, అభ్యసన ఫలితాలు, ప్రవర్తన, ఆరోగ్యం, మానసిక వికాసంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులు సూచించారు.



ప్రతి విద్యార్థి భవిష్యత్తు బంగారమవ్వాలంటే పాఠశాల-తల్లిదండ్రుల సమన్వయం ఎంతో అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి నిర్వహించిన ఆటలు, పాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. తల్లిదండ్రులు సైతం ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమానికి మరింత శోభను తీసుకువచ్చారు. కార్యక్రమంలో నో డ్రగ్స్-నో టొబాకో -నో ఆల్కహాల్ అనే సందేశంతో మాదకద్రవ్యాల దుష్పరిణామాల పై అవగాహన కల్పించారు. విద్యార్థులకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత సమాచార భద్రత, మంచి అలవాట్లు, క్రమశిక్షణ, పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, ట్రాఫిక్ నియమాలు వంటి అంశాలపై కూడా అవగాహన కలిగించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "సుభతిధి భోజన్" కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు కలిసి సహపంక్తి భోజనాలు చేసి సమానత్వం, సామరస్యం, సోదరభావాన్ని చాటారు. ఈ కార్యక్రమం ద్వారా పాఠశాల-సమాజ బంధం మరింత బలోపేతమైందని పలువురు అభిప్రాయపడ్డారు. మెగా పీటీఎం-4.0 కార్యక్రమం తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై మరింత విశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, విద్యార్థుల విద్యాభివృద్ధికి అందరూ భాగస్వాములు కావాలనే సందేశాన్ని సమాజానికి చాటిచెప్పింది. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, మండల విద్యాశాఖ అధికారి అబ్దుల్ సత్తార్, పేరెంట్స్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ కంచి రామారావు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.







ఇంటింటికి దేశం కార్యక్రమంలో ఎమ్మెల్యేలను నిలదీయాలి

విజయవాడలో జరిగిన సమావేశంలో దళిత బహుజనులతో నీలం విజ్ఞప్తి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 24)





ఈ నెల 27 నుంచి రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం ప్రభుత్వం ప్రారంభిస్తున్న ఇంటింటికి దేశం కార్యక్రమంలో దేశం ఎమ్మెల్యేలను ఎస్సీ ఎస్టీ బీసీలు నిలదీయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేందర్ రావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం విజయవాడ ప్రెస్ క్లబ్లో తెలుగుదేశం ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ బీసీలకు ఇచ్చిన హామీలు అనే అంశంపై రాష్ట్రంలోని అనేక దళిత సంఘాలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నీలం నాగేందర్రావు మాట్లాడుతూ గత ప్రభుత్వం రద్దు చేసిన ఎస్సీ ఎస్టీ బీసీల 27 సంక్షేమ పథకాలను అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కుచ్చుటోపి పెట్టింది అన్నారు. మాల, మాదిగ, రెల్లి, బీసీ, ఎస్టీ కార్పొరేషన్లకు కూడా 24 -25 ఆర్థిక సంవత్సరంలో యాక్షన్ ప్లాన్ కోట్లాది రూపాయలు విడుదలదళ చేసి కూడా రూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు. అలాగే 25-26 ఆర్థిక సంవత్సరానికి మరల యాక్షన్ ప్లాన్ విడుదల చేసి బాహుబలి సెట్టింగులు పెట్టి మంత్రులు, ఎమ్మెల్యేలు రాష్ట్రవ్యాప్తంగా సబ్సిడీ రుణాలు ఇస్తున్నట్టు ఫోటోలు దిగి ఎస్సీ ఎస్టీలకు పైసా కూడా ఇవ్వలేదన్నారు. బ్యాంకులతో సంబంధం లేకుండా నిరుద్యోగులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఎన్ఎస్ఎఫ్డిసి, ఎన్ఎస్టిఎఫ్డిసి, ఎన్బిసిఎఫ్డిసి లాంటి పథకాలకు నిధులు లేకుండా మూడవ సంవత్సరంలో కూడా మంగళం పాడారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాంతర వివాహ నిధులు రాష్ట్రంలో ఒక్కరికి కూడా ఇవ్వకుండా ఆన్లైన్ అంటూ గ్రామ సచివాలయాలకు పంపించి లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం అరుంధతి నక్షత్రం చూపిస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 50 ఏళ్లకే వృద్ధాప్య పెన్షన్లు ఇస్తామంటూ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పి మూడేళ్లు అవుతున్న రాష్ట్రంలో ఒక్కరికి కూడా ఎస్సీ, ఎస్టీ, వృద్ధాప్య పెన్షన్ ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం దగా చేస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కేసుల్లో కేసులు కట్టకుండా ఎఫ్ఐఆర్లు కట్టినా అగ్రకులాలచే కౌంటర్ కేసులు పెట్టిస్తూ ఎస్సి, ఎస్టీల హక్కులకు, రక్షణకు కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తుందన్నారు. అమరావతికి, రామాయపట్నం పోర్టులకి వేలాది ఎకరాలు భూ సమీకరణ చేస్తూ ఎస్సీ, ఎస్టీ స్మశాన భూములకు జీవోలు ఇచ్చి కూడా ఒక్క గ్రామంలో స్మశానం భూమి ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం పట్టణాలలో టిడ్కో ఇల్లు కేటాయిస్తామని చెప్పి కట్టిన ఇల్లు కూడా ఎస్సీ, ఎస్టీలకు కేటాయించడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చాపచుట్టి పెన్షన్ల పంపిణీ సంక్షేమం అని సంకలు కొట్టుకుంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులకు బ్యాక్లాగ్ పోస్టులు భర్తీ చేయకుండా, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం నయవంచనకు పాల్పడుతుందన్నారు. కావున ఈ నెల 27 నుండి రాష్ట్రంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో ఇళ్లకు రాబోతున్న ఎమ్మెల్యేలను తెలుగుదేశం నాయకులను ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజలు తమ పథకాల అమలు పై నిలదీయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేందర్రావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి దళిత బహుజన ఫ్రంట్ అధ్యక్షులు కొరివి వినయ్ కుమార్ అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంధ్ర మాలాద్రి, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి కరవాది సుబ్బారావు,మేళం భాగ్యరావు, చంగల్రావు, వైయస్సార్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మూరి కనకారావు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరిపోగు వెంకటేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

మండలంలో ఘనంగా మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్

(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జులై 24)



మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక,ప్రాథమికోన్నత,ఉన్నతపాఠశాలలోశ క్రవారంమెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్, కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిటిఎమ్ కార్యక్రమాలను అంగరంగ వైభవంగా, అభ్యంతరాలు లేకుండా నిర్వహించడం జరిగిందన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి చేపట్టిన సంక్షేమ పథకాలైన పాఠశాల అభివృద్ధి, తల్లికి వందనం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనపథకం, మెనూ విధానం, హోలిస్టిక్స్ ప్రోగ్రెస్ కార్డులు, లెర్నింగ్ అవుట్ కామ్స్ విధానాల పై విద్యార్థినీ, విద్యార్థులకు పాఠశాలల్లో చదివిన పూర్వ విద్యార్థుల ఆర్థిక సహకారాలతో విడివిడిగా ఏర్పాటు చేసిన డైనింగ్ హాలు, వాటి పరిశుభ్రత, పాఠశాలల్లోని ఆట స్థలాలు, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యావిధానం కొనసాగుతున్న పరిస్థితులను గురించి విద్యార్థుల తల్లిదండ్రులు చూసి వాటి పై తల్లిదండ్రులు సంతృప్తి చెందారన్నారు. అంతే కాక విద్యావిధానాన్ని అభివృద్ధిపథంలో నడిపేందుకు తల్లిదండ్రుల సలహాలను కూడా పరిగణలోనికి తీసుకుని విద్యార్థుల భవిష్యత్తును బంగారు బాటలో నడిపేందుకు వారి సలహాలు కూడా పాటించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రులను కోరడం జరిగింది. మండల కేంద్రమైన తర్లుపాడులోని స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, కలుజువ్వలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తుమ్మలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెన్నారెడ్డిపల్లె ప్రస్తుత పాఠశాల, పోతలపాడు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, తాడివారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పైనింగ్ స్టార్స్ విద్యార్థులకు ప్రత్యేకమైన అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, ఉపాధ్యాయేతర సిబ్బంది, పాఠశాలల ఎస్ఎంసి చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ఎస్ఎంసి సభ్యులు, దాతలు అందరూ సంయుక్తంగా కలిసి మధ్యాహ్న భోజనం చేసి వారందరూ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు కొందరు పాఠశాల అభివృద్ధి కొరకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని వారు తెలపడం సంతోషకరంగా ఉందని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం సుధాకర్, చిలకపాటి సత్యనారాయణ, బాలరాజు, ఎస్ కె మౌలాలి, ఎస్ఎంసి చైర్మన్ చిన్నా రాజారామిరెడ్డి, వైస్ ఛైర్మన్ మార్కండెబోయిన దుర్గభవాని, తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



కనిగిరిలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో పండుగలా మెగా పీటీఎం

ఉత్సాహంగా పాల్గొన్న 500 మంది విద్యార్థుల తల్లిదండ్రులు







(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 24)

కనిగిరి నియోజకవర్గంలోని కనిగిరి, పామూరు, సిఎస్ పురం, హనుమంతునిపాడు, పీసీ పల్లి, వెలిగండ్ల మండలాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెగా పీటీఎం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మెగా పీటీఎం కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కలవ విజయలక్ష్మి నేతృతంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పండుగలా నిర్వహించారు. పాఠశాలకు విచ్చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులను ప్రధానోపాధ్యాయురాలు కలవ విజయలక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది, గైడ్స్ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. మెగా పీటీఎం సందర్భంగా పాఠశాల ఆవరణలో ఉన్న చదువుల తల్లి సరస్వతి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ1 దాసరి సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నారని, విద్యకు ఏ ఒక్కరూ దూరం కాకూడదని రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ అక్షరాస్యత దిశగా కొట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందని అన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులతో మమేకమై విద్యార్థినిల ప్రోగ్రెస్ గురించి తల్లిదండ్రులకు తెలియజేశారు. అలాగే విద్యార్థినిల తల్లిదండ్రుల మొబైల్స్‌లో లీప్ యాప్ యొక్క విశిష్టతను తెలియపరుస్తూ యాప్ ను డౌన్లోడ్ చేయించారు. పాఠశాల పూర్వ విద్యార్థిని, ఉపాధ్యాయురాలు షేక్ ఆరిఫా గత సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిలకు రూ.10వేలు ప్రోత్సాహక నగదు బహుమతిని అందజేశారు. పాఠశాల ఆవరణలో విద్యార్థినిల తల్లులకు మ్యూజికల్ చైర్, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. పట్టణంలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ రాము, డాక్టర్ స్రవంతి పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నాగ పద్మజ, లక్ష్మీ, అలివేలు, రషీద, కోటేశ్వరి, శ్రీను, గోపి, రమణయ్య, నారాయణ, పీఈటీలు భూలక్ష్మి, నందిని, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వి కోటేశ్వరీ, కమిటీ సభ్యులు, 500 మంది విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

గుర్రం జాషువా ఆశయాలు సమాజానికి స్ఫూర్తి

ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు





(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జులై 24)

మహాకవి గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా వినుకొండలోని జాషువా విగ్రహానికి ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ, తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యాన్ని రగిలించిన మహాకవి, మానవతావాది గుర్రం జాషువా సమానత్వానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. పల్నాడు జిల్లా వినుకొండలో జన్మించిన జాషువా కుల, మత, వర్ణ వివక్షలకు వ్యతిరేకంగా తన కలాన్ని ఆయుధంగా మార్చి సమానత్వం, మానవ హక్కులు, సామాజిక న్యాయం కోసం నిరంతరం రచనలు చేశారని కొనియాడారు. “విశ్వనరుడు” అనే భావనను ప్రపంచానికి చాటిచెప్పిన జాషువా, మనిషిని కులంతో కాదు గుణంతో కొలవాలని తన కవిత్వం ద్వారా బలంగా చెప్పారని పేర్కొన్నారు. పేదలు, అణగారిన వర్గాలు, కష్టజీవుల జీవితాలను తన రచనలకు కేంద్రబిందువుగా చేసుకుని సమాజంలోని అసమానతలను ధైర్యంగా ప్రశ్నించారని తెలిపారు. “గబ్బిలం”, “క్రీస్తు చరిత్ర”, “నా కథ” వంటి రచనల ద్వారా సమానత్వం, మానవత్వం, సామాజిక బాధ్యతను ప్రతిబింబించిన జాషువా, సాహిత్యాన్ని వినోద సాధనంగా కాకుండా సామాజిక మార్పుకు సాధనంగా ఉపయోగించిన మహాకవిగా తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. జాషువా ఆశయాలు నేటికీ యువతకు స్ఫూర్తినిస్తున్నాయని, ప్రేమ, శాంతి, సామరస్యం, సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ఆయన జీవితం మార్గదర్శకమని చెప్పారు. కుల, మత భేదాలకు అతీతంగా ప్రతి మనిషిని గౌరవించే సమాజ నిర్మాణమే గుర్రం జాషువాకు నిజమైన ఘన నివాళి అవుతుందని జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, జాషువా అభిమానులు పాల్గొన్నారు.

హై స్కూల్ ప్లస్ గిద్దలూరులో మెగా పిటిఎం కార్యక్రమం విజయవంతం

కాలేజీ టాపర్స్‌కు ప్రతిభా పురస్కారాలు అందజేసిన దాతలు

(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జులై 24)



హై స్కూల్ ప్లస్ గిద్దలూరు నందు మెగా పిటిఎం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆహ్వాన కమిటీ సభ్యులు విద్యార్థుల తల్లిదండ్రులను, ప్రజా ప్రతినిధులను, ప్రభుత్వ అధికారులను పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానం పలికారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి అశ్వని కుమార్, టిడిపి గిద్దలూరు టౌన్ అధ్యక్షులు షానేషావలి, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ రసూల్ హాజరయ్యారు. క్లాస్ టీచర్లతో విద్యార్థుల తల్లిదండ్రులు సమావేశమై తమ పిల్లల విద్యపరమైన ప్రోగ్రెస్ ను తెలుసుకున్నారు.అనంతరం మహిళలందరికీ మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్ ఆటలను పాఠశాల మహిళా ఉపాధ్యాయినీలు నిర్వహించారు. పురుషులకు మెడికల్ బాల్, షాట్ పుట్ ఆటలను ఫిజికల్ డైరెక్టర్ నిర్వహించారు. తదుపరి జరిగిన సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు అధ్యక్షతగా వహించగా పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ రసూల్, కౌన్సిలర్ లొక్కు రమేష్, కౌన్సిలర్ మండ్ల శ్రీనివాసులు, యల్లా శ్రీనివాసులు, మహబూబ్ పీరా, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ సిద్దేశ్వర శర్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలల్లో ప్రభుత్వం అమలు పరుస్తున్న పథకాలను, కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేసి పాఠశాల ప్రగతి నివేదికను తెలియజేశారు. ఎస్ఎంసి చైర్మన్ రసూల్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందని తెలియజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు స్వామి కుమార్, విజయరాజు మరియు లెక్చరర్లు బాలగురవయ్య, డాక్టర్ మొర్రి పిచ్చయ్య, శోభారాణి, తదితరులు ప్రసంగించారు. గత సంవత్సరం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో టాపర్స్ గా నిలిచిన విద్యార్థినీలకు ప్రైజ్ మని ని రిటైర్డ్ ఉపాధ్యాయులు షేక్ మహబూబ్ పీరా సమకూర్చగా వాటిని విద్యార్థులకు బహుకరించడం జరిగింది. కెమిస్ట్రీ లెక్చరర్ గా పనిచేస్తున్న వెంకాయమ్మ తన సబ్జెక్టులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రైజ్ మనీని అందజేశారు. మ్యాథమెటిక్స్‌లో టాపర్స్ గా నిలిచిన విద్యార్థినీలకు ప్రిన్సిపాల్ సిద్దేశ్వర శర్మ ప్రైజ్ మనీని అందజేశారు. ఆటలల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. సమావేశానికి హాజరైన ప్రతి ఒక్క తల్లిదండ్రులకు కన్సోలేషన్ బహుమతులను అందజేసి అభినందించారు. అనంతరం మధ్యాహ్న సహపంక్తి భోజనాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు కలిసి భోజనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీరామిరెడ్డి, పీరయ్య, శ్రీనివాసరెడ్డి, మరియన్ బీబీ, తదితరులు పాల్గొన్నారు.



రైతులు 100% బీమా ప్రీమియం కట్టే విధంగా చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ పి రాజబాబు







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 24)

జిల్లాలోని రైతులు అందరి చేత 100% భీమా ప్రీమియం కట్టే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని జిల్లా కలెక్టర్ పి. రాజబాబు ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బ్యాంకర్లు, ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు, అధికారులతో క్రాప్ ఇన్సూరెన్స్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బీమా కంపెనీలు తప్పనిసరిగా బీమాను చెల్లించాలని ఆయన సూచించారు. రైతులు కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా ఎన్రోల్మెంట్ చేసుకోవాలని ఆ విధంగా అధికారులు చర్య తీసుకోవాలని ఆయన సూచించారు. గత సంవత్సరం క్రాఫ్ ఇన్సూరెన్స్ కింద ఎంత నగదు చెల్లించారు ఈ సంవత్సరం ఎంత చెల్లించవలసి ఉంటుంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. కౌలు రైతులకు భీమా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పంట బీమా చెల్లింపులో సమస్యలు ఉంటే దానిని ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రైతులు ఎన్రోల్మెంట్ చేసుకునేటప్పుడు కామన్ సర్వీస్ సెంటర్లు అధిక మొత్తంలో నగదు వసూలు చేయకుండా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఐసీసీఐసీఐ లాంబార్డ్, అగ్రికల్చరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వారి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ జెడి శ్రీనివాసరావు, ఎల్‌డిఎం రమేష్, పలువురు బ్యాంకు ప్రతినిధులు, ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



షణ్ముఖ వెలుగు

ePaper
www.shanmukhavelugu.com

విద్యారంగంలో మునుపెన్నడూ లేని విధంగా గొప్ప సంస్కరణలు తెచ్చిన వ్యక్తి నారా లోకేష్ బాబు

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, జులై 24)

విద్యారంగంలో మునుపెన్నడూ లేని విధంగా గొప్ప సంస్కరణలు తెచ్చిన వ్యక్తి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌బాబు అని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం గొట్లగట్టు గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్స్ 4.0 సమావేశంకు ఆయనకు విద్యార్థులు పూలు చల్లి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ మునిపెన్నడూ లేనివిధంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు అందరి అభిప్రాయాలు తీసుకొని ఈ మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. తద్వారా విద్యార్థుల తల్లిదండ్రులు టీచర్స్ కలిసి చర్చిస్తే విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేసిన వారు అవుతారని, ఈ విన్నుతా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. ఈ గొట్లగట్టు జడ్పీ హైస్కూల్ ఎంతో ఆహ్లాదకరంగా ఉందని చక్కని ప్లేగ్రౌండ్, చక్కని బిల్డింగ్స్, పచ్చదనంతో పరిశుభ్రంగా ఉందని ఇటువంటి వాతావరణంలో విద్యార్థులు తమకున్న లక్ష్యాలను సులభంగా చేరుకోవచ్చునని అన్నారు. విద్యార్థులు చక్కని క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా విద్యార్థులను చెడు వ్యసనాల బారిన పడకుండా కాపాడుకోవాలని ఇప్పటి ప్రభుత్వం విద్యార్థులకు ఎంతో నాణ్యమైన ఉచిత పుస్తకాలను, బ్యాగులను, బట్టలను, షూ లను కూడా అందిస్తుందని ఒక రూపాయి ఖర్చు కూడా లేకుండా నాణ్యమైన విద్యను అందిస్తుందని అన్నారు. మార్కాపురం నియోజకవర్గంలో 10వ తరగతిలో ఎక్కువ మార్కులు సాధించిన గొట్లగట్టు హై స్కూల్ హెడ్మాస్టర్‌ను మార్కాపురం జిల్లా విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి రూ.1లక్ష రూపాయల క్యాష్ ప్రైజ్ అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి సామా సుబ్బారావు, పొదిలి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఎం రాజేష్‌కుమార్, ఇత ప్రజాప్రతినిధులు విద్యార్థులతో కలిసట కూర్చుని భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో గొట్లగట్టు గ్రామ మాజీ సర్పంచ్ పెరికె సుఖదేవ్ (బూన్), స్థానిక నాయకులు పరిటాల సుబ్బయ్య, వెలుగొండ దేవస్థాన అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కుందురు కాశిరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, తెలుగుదేశంపార్టీ నాయకులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.











పిల్లల భవిష్యత్తుకు తల్లిదండ్రులే తొలి గురువులు

పాఠశాలలే వారి కలలకు పునాది
మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ రాష్ట్ర విద్యా వ్యవస్థలో చారిత్రాత్మక సంస్కరణ
ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జులై 24)

వినుకొండ నియోజకవర్గం ఈపూరు మండలంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం (కెజీబీవీ) లో నిర్వహించిన మెగా పెటిఎంలో పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాతో కలిసి పాల్గొన్న ఆయన, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ బ్యాగులు, షూస్ పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తూ వారి చదువు, లక్ష్యాలు, భవిష్యత్ ఆశయాల గురించి ఆప్యాయంగా మాట్లాడారు.విద్యార్థుల భవిష్యత్తును మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "మెగా పేరెంట్-టీచర్ మీటింగ్" విద్యా రంగంలో ఒక చారిత్రాత్మక కార్యక్రమమని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దూరదృష్టితో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది తల్లిదండ్రులను పాఠశాలలతో అనుసంధానిస్తూ విద్యార్థుల సమగ్రాభివృద్ధికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు.

రూ.1.59 కోట్లతో నూతన కేజీబీవీ డార్మిటరీ ప్రారంభం

బాలికల విద్యకు మరింత భద్రత, మెరుగైన వసతి కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది అని జీవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా రూ.1.59 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన డార్మిటరీ భవనాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ప్రారంభించారు. అనంతరం విద్యా సముదాయాన్ని మొత్తం పరిశీలించిన వారు మౌలిక వసతులపై సంతృప్తి వ్యక్తం చేశారు.విద్యార్థినులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షిత వాతావరణంలో విద్యను అభ్యసించేలా ప్రభుత్వం అన్ని సౌకర్యాలను కల్పిస్తోందని తెలిపారు. విద్యా ప్రమాణాల పెంపు, బాలికల భద్రత, ఆధునిక వసతుల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం రాజీ పడదని స్పష్టం చేశారు.

గత ఐదేళ్లు ఆగిపోయిన పనులకు ఇప్పుడు వేగం
అసంపూర్తి నిర్మాణాలను పూర్తి చేస్తాం

నాడు-నేడు పేరుతో ప్రారంభించి వదిలేసిన పనులను పూర్తి చేయాలని కలెక్టర్‌కు ప్రతిపాదన. గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పేరుతో ప్రారంభించిన అనేక పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాలు అసంపూర్తిగానే మిగిలిపోయాయని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు ప్రారంభించడం మాత్రమే కాకుండా వాటిని పూర్తి చేయడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 2018లో ప్రత్యేక నిధులు తీసుకొచ్చి అనేక అంగన్‌వాడీ భవనాలను సుమారు 80 శాతం వరకు పూర్తి చేశామని, మిగిలిన పనులను గత ఐదేళ్లలో పూర్తి చేయడంలో అప్పటి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు అందజేశామని, వాటిని త్వరితగతిన పూర్తి చేసేలా









చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా అభివృద్ధికి అవసరమైన ప్రతి సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించేలా కృషి చేస్తానని జీవీ ఆంజనేయులు స్పష్టం చేశారు. ప్రతి శనివారం 'నో బ్యాగ్ డే' చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసమే ప్రభుత్వ లక్ష్యం. 'తల్లికి వందనం'తో ప్రతి విద్యార్థికి అండగా కూటమి ప్రభుత్వం. విద్యార్థులు పరీక్షల్లో మార్కులు సాధించడం మాత్రమే కాకుండా జీవితంలో లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలని జీవీ ఆంజనేయులు సూచించారు. పిల్లలను కొట్టడం ద్వారా కాదు, ప్రేమతో, ప్రోత్సాహంతో, మార్గనిర్దేశం చేయడం ద్వారా ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లవచ్చని అన్నారు. పిల్లలు సెలవులకు ఇంటికి వచ్చినప్పుడు వారి చదువు, ప్రవర్తన, ఆసక్తుల గురించి తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో చర్చించాలని, ఉపాధ్యాయులు కూడా ప్రతి విద్యార్థి పురోగతిని తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. అలా చేస్తేనే విద్యార్థుల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రతి పాఠశాలలో 'నో బ్యాగ్ డే' ను తప్పనిసరిగా సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆ రోజును వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాభివృద్ధి, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, సృజనాత్మకత పెంపొందించే కార్యక్రమాలకు వినియోగించాలని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీసుకొచ్చిన 'తల్లికి వందనం' పథకం ద్వారా కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉన్నా ప్రతి విద్యార్థికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. అలాగే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల విద్యార్థులను, హాస్టల్లలో ఉన్న పిల్లలను చూసేందుకు తల్లులకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. గ్రామాభివృద్ధికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపడుతున్న కార్యక్రమాలు గ్రామీణ విద్యా వాతావరణాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయని కొనియాడారు. చివరగా ప్రతి పిల్లవాడూ ఒక లక్ష్యంతో చదవాలి. ప్రతి తల్లిదండ్రి తన బిడ్డ కలలకు తోడుగా నిలవాలి. ప్రతి ఉపాధ్యాయుడు ఒక విద్యార్థి జీవితాన్ని తీర్చిదిద్దే శిల్పిగా మారాలి. అదే ఈ మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ యొక్క అసలు లక్ష్యం అని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com